గొట్టా బ్యారేజీ వద్ద తగ్గిన నీటి నిల్వ



హిరమండలం, న్యూస్‌టుడే: వంశధార నదిలో గొట్టా బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో క్రమేపీ తగ్గుతోంది. నదీగర్భంలో నీటి నిల్వ క్షీణించడంతో వంశధార కుడి, ఎడమ ప్రధాన కాలువలకు నీటి విడుదలకు అధికారులు ఇబ్బంది పడుతున్నారు. వంశధార జలాశయం లింకు కాలువ గేట్లు ఎత్తివేసి కుడి ప్రధాన కాలువలోకి శుక్రవారం నీటిని విడిచిపెట్టారు. జలాశయంలోనూ 2.3 టీఎంసీల డెడ్ స్టోరేజీ నీటి నిల్వ ఉంది. జలాశయం నుంచి కుడి ప్రధాన కాలువలోకి నీరు వచ్చేందుకు అవకాశం లేనప్పటికీ పొక్లెయిన్‌తో కాలువ తవ్వి బయటకు విడిచిపెట్టారు. వంశధార హిరమండలం కన్‌స్ట్రక్షన్ డివిజన్ ఈఈ ఎంవీ రమణ మాట్లాడుతూ కలెక్టర్, వంశధార ఎస్‌ఈల ఆదేశాల మేరకు జలాశయం గర్భం నుంచి రోజుకు 150 క్యూసెక్కుల నీటిని కుడి కాలువలోకి విడిచిపెడుతున్నట్లు తెలిపారు.



శ్రీముఖలింగంలో ఆకాశదీపం

శ్రీముఖలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం అర్చకులు ఆకాశ దీపం వెలిగించారు. ఒడిశా సంప్రదాయం ప్రకారం కార్తిక మాసం ప్రారంభానికి 15 రోజుల ముందుగా దీన్ని వెలిగిస్తారు. ఒడిశా రాజులు నిర్మించిన దేవాలయం కావడంతో అప్పటి సంప్రదాయాలను కొనసాగిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. ఆశ్వయుజ మాసం పౌర్ణమి మరుసటి రోజు నుంచి కార్తిక మాసం చివరి వారం వరకు సుమారు 45 రోజుల పాటు ఆకాశ దీపాన్ని వెలిగిస్తామన్నారు. – న్యూస్‌టుడే, జలుమూరు



హాజరైన మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు

సీఎం సార్..!

తెదేపా ప్రజాప్రతినిధుల సమావేశంలో సమస్యలు ప్రస్తావించిన ఎమ్మెల్యేలు

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం: గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన ఆ పార్టీ ప్రజాప్రతినిధుల సమావేశానికి జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొందరు ఎమ్మెల్యేలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ సహకార, నీటి సంఘాల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై సూచనలు చేశారు. ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి (నరసన్నపేట), గొండు శంకర్ (శ్రీకాకుళం), బెందాళం అశోక్ (ఇచ్ఛాపురం) పాల్గొన్నారు.


బకాయిలు చెల్లించరూ..

తెదేపా పాలన (2014-19)లో చేపట్టిన పనులకు చాలా వరకు బకాయిలు చెల్లించలేదు. నీరు-చెట్టు, ఉపాధి హామీ పథకం, ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ కింద చేపట్టిన పనులకు బిల్లులు మంజూరు చేయాలి. ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక, పాఠశాలల్లో తరగతి గదులు, వంటశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణం తదితర పనులకు రూ.1,300 కోట్లు చెల్లించాలి. వైకాపా ప్రభుత్వం రూపాయి ఇవ్వకపోవడంతో పనులు చేసిన వారు ఇబ్బంది పడుతున్నారు.
– కూన రవికుమార్, ఎమ్మెల్యే, ఆమదాలవలస

పరిశ్రమలు మంజూరు చేయండి..

పలాస నియోజకవర్గానికి పరిశ్రమలు మంజూరు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. సూపర్-6 పథకాల అమలులో భాగంగా దీపావళి నుంచి ఉచిత సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ముందుగా 18-59 సంవత్సరాల మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తే బాగుంటుంది. నియోజకవర్గంలో జనసేనకు సంబంధించి గ్రూపులు ఏర్పడటంతో సమన్వయం కొరవడుతోంది.
– గౌతు శిరీష, ఎమ్మెల్యే, పలాస

యువతకు ఉపాధి కల్పించండి



నూతన పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలి. స్థానికంగా యువతకు ఉపాధి కల్పించేలా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేయాలి.
– మామిడి గోవిందరావు, ఎమ్మెల్యే, పాతపట్నం

ఉద్దానం మంచి నీటి పథకం	ప్యాకేజీలు: 2	నీటి ఆధారం: మహేంద్రతనయ, బాహుదా, కవిటి బీల	మండలాలు: ఇచ్ఛాపురం, సోంపేట, కవిటి, కంచిలి, మందస, పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం	ఆధారిత జనాభా: సుమారు 4 లక్షలకు పైగా

● సోంపేట మండలం ఇసుకలపాలెం, గొల్లగండి గ్రామాలకు సంబంధించిన పైపులైన్లు తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో నీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

● మందస మండలం సరియాపల్లిలో తీవ్ర నీటి ఎద్దడి ఉంది. ఈ గ్రామానికి రోజు విడిచి రోజు నీరందుతోంది.



మందస మండలం మఖరజోల ప్రధాన నీటి సరఫరా కేంద్రం వద్ద పని చేయని మోటార్లు

గాలికొదిలేశారు..!

● నెరవేరని ఉద్దానం ప్రాజెక్టు లక్ష్యం
● నిధులు కేటాయించకపోవడంతో ఇబ్బందులు

న్యూస్‌టుడే, సోంపేట, కాశీబుగ్గ

మూడు నియోజకవర్గాల ప్రజలకు తాగు నీరు అందించే ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు నిర్వహణ లోపంతో మూలన పడే పరిస్థితి నెలకొంది. నిధులు కేటాయించకపోవడంతో మోటార్లు, ట్యాంకులు, కుళాయిలు, పైపుల మరమ్మతులు, సిబ్బంది వేతనాల పరంగా ఇబ్బందులు నెలకొన్నాయి. చాలా గ్రామాలకు నీటి సరఫరా జరగడం లేదు. మెగా వాటర్ ప్రాజెక్టు పేరిట కొన్ని ట్యాంకులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏ గ్రామానికి ఏ పథకం ద్వారా నీరు సరఫరా చేయాలో.. ఉద్దానం సిబ్బంది ఎక్కడ పని చేయాలి? అనే విషయమై సందిగ్ధత కొనసాగుతోంది.

● ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లోని 8 మండలాల్లో ప్రజల దాహార్తి తీర్చే ప్రతిష్ఠాత్మక పథకం నిర్వహణను వైకాపా ప్రభుత్వం గాలికొదిలేసింది. సోంపేట మండలం టి.శాసనాం ప్రధాన సంపు వద్ద ఆరు మోటార్లకు ప్రస్తుతం రెండు మాత్రమే పని చేస్తున్నాయి. బావుల నుంచి నీరు తోడే ప్రక్రియ ఆలస్యమవుతోంది. ప్రధాన సంపు నుంచి ఇతర సంపులకు సరఫరా పరంగా సమస్యలు నెలకొన్నాయి.

● మందస మండలం మఖరజోల సంపు వద్ద నాలుగు మోటర్లు నిరంతరం పని చేయాల్సి ఉండగా రెండు మాత్రమే పని చేస్తున్నాయి. పలాస, టెక్కలి నియోజకవర్గాల పరిధి గ్రామాలకు నీరు సరఫరా చేయడానికి టి.శాసనం, మఖరజోల సంపులు ప్రధాన కేంద్రాలు. ఇక్కడి మోటార్ల మరమ్మతులను పట్టించుకోకపోవడంతో ట్యాంకులకు నీరు సరఫరా చేయడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

● సోంపేట సెక్షన్‌కు సంబంధించి పలు చోట్ల పైపులైన్లు, విద్యుత్తు పరమైన ఇబ్బందులు ఉన్నాయి. గొల్లగండి, కుసుంపురం, సీహెచ్ మెళియాపుట్టి, ఒంటూరు, ఈదుపురం, కవిటి సెక్షన్ల పరిధిలో పైపులు మరమ్మతులకు గురవడంతో నీటి సరఫరాకు సమస్యలు తలెత్తుతున్నాయి. మిగిలిన గ్రామాల పరిధిలోనూ కుళాయిలు, పైపులైన్ ఇబ్బందులతో వారం, పది రోజులకు ఒకసారి నీరు సరఫరా చేస్తున్నారు.

● ఉద్దానం మంచినీటి పథకంలో 109 మంది సిబ్బంది పని చేస్తున్నారు. వీరికి 15 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. సంఘం ఆధ్వర్యంలో ఏర్పడిన సొసైటీ ద్వారా టెండర్ వేసి వేతనాలు అందుకునేవారు. గత ప్రభుత్వం ఈ ప్రక్రియకు మంగళం పలకడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి.

కనీస వేతనాలు లేవు..



దశాబ్దాలుగా పని చేస్తున్నప్పటికీ కనీస వేతనాలు ఇవ్వడం లేదు. విద్యుత్తు వినియోగం మేరకు చెల్లిస్తున్నారు. మోటార్లు మరమ్మతులకు గురవుతున్నప్పటికీ వాటిని బాగు చేయడం లేదు. సామగ్రి అందుబాటులో లేకపోవడంతో మంచినీరు సరఫరా చేయడం కష్టమవుతోంది.
-బి.జోగారావు, కార్యదర్శి, కవిటి ఉద్దానం కార్మిక సంఘం

ఉద్యోగ భద్రత కల్పించాలి..



ఉద్దానం ప్రాజెక్టును ప్రారంభించినప్పటి నుంచి పని చేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి. క్రమబద్ధీకరిస్తారనే ఆశతో ఇతర అవకాశాలను వదిలేసి నామమాత్రపు వేతనాలకు పని చేస్తున్నాం. నెలకు రూ.9 వేలు ఇస్తుండగా సకాలంలో అందడం లేదు. కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలి.
- కె.నీలాచలం, అధ్యక్షుడు, వజ్రపుకొత్తూరు ఉద్దానం కార్మిక సంఘం

చర్యలు తీసుకుంటాం..

ఉద్దానం ప్రాజెక్టు నిర్వహణ మెరుగుపడేలా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటాం. జిల్లా పరిషత్తు, ఇతర స్థానిక సంస్థలకు సంబంధించిన నిధులు వినియోగించి మోటార్లు బాగు చేయడం, పైపులైన్ మరమ్మతులు, ఇతర పనులు చేపడతాం. అన్ని గ్రామాలకు మంచినీరు సరఫరా చేస్తాం. సిబ్బంది వేతనాలు గుత్తేదారు ద్వారా చెల్లించాలి. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. - రంగప్రసాద్, ఈఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, శ్రీకాకుళం

దీపావళి సంబరాలకు ఏర్పాట్లు



కలెక్టరేట్(శ్రీకాకుళం),న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలోని డచ్ భవన్ వద్ద దీపావళి సంబరాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా పర్యాటక మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో, నగరపాలక సంస్థ కమిషనర్, పర్యాటక అధికారులకు ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. సిక్కోలు సంబరాలు రెండు రోజుల పాటు నిర్వహించాలని, ఫుడ్ ఫెస్టివల్‌కు ఏర్పాట్లు చేయాలన్నారు. టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని, ఆయా ప్రాంతాల్లో బస్సులు నడపాలన్నారు. విజయాదిత్యసాగర్ ఉద్యానం చుట్టూ ప్రహరీ నిర్మించాలని.. వజ్రపుకొత్తూరు మండలం శివసాగర్ బీచ్ వద్ద సమస్యలు లేకుండా చూడాలని తహసీల్దారును ఆదేశించారు. హిరమండలం వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో వాటర్ స్పోర్ట్స్‌కు సంబంధించిన ప్రతిపాదనలను పర్యాటక శాఖ ఆర్డీ శ్రీనివాసరావు కలెక్టర్‌కు వివరించారు.



కట్టు తప్పితే ప్రమాదమే..!

అసలే ఛిద్రమైన రహదారి. ఆపై సామర్థ్యానికి మించి బరువుతో వాహనాలు రాకపోకలు సాగిస్తూ ప్రయాణికులను ప్రమాదాల్లోకి నెడుతున్నారు. అలికాం - బత్తిలి రహదారిలో హిరమండలం నుంచి ఆమదాలవలస వైపు వెళ్తున్న వాహనంపై గోనె సంచుల్లో గాజు సీసాల్ని తరలిస్తున్నారు. మూటలకు తాడు కట్టారు. ప్రమాదవశాత్తు కట్టు తప్పి కింద పడితే రోడ్డంతా గాజు పెంకులతో అస్తవ్యస్తంగా మారుతుంది. ఈ విషయమై సరుబుజ్జిలి ఏఎస్సై చంద్రినాయుడును 'న్యూస్‌టుడే' సంప్రదించగా వాహనాల్లో సామర్థ్యానికి మించి సామగ్రి తీసుకెళ్లకూడదని.. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, సరుబుజ్జిలి


ఇసుక అక్రమ రవాణాకు అక్రమార్కులు కొత్త దారులు వెతుకుతున్నారు. జిల్లాలో ఇసుకను లారీలకు ఎత్తి రహదారి పైకి వచ్చే సరికి పొరుగు రాష్ట్రం రసీదులు చూపుతూ యథేచ్ఛగా సరిహద్దులు దాటించేస్తున్నారు. నకిలీ బిల్లులు సృష్టించి తనిఖీ అధికారులను పక్కదారి పట్టిస్తున్నారు. వాటి నిగ్గు తేల్చే సరైన వ్యవస్థ లేకపోవడంతో దందా యథేచ్ఛగా సాగుతోంది. నిత్యం 100కు పైగా లారీలు వెళ్తుంటే సగానికి పైగా నకిలీ రసీదులేనని సమాచారం.



ఈ నెల 9న పైడిభీమవరం తనిఖీ కేంద్రం వద్ద ఈ లారీని అధికారులు పట్టుకున్నారు. ఒడిశాలోని గుణుపురం వద్ద ఓ ర్యాంపు నుంచి ఇసుక తీసుకొస్తున్నట్లు రసీదులో ఉంది. దీనిపై క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే వేరే లారీ నంబరు వచ్చింది. అక్రమార్కులు ఈ పద్ధతిలో రోజూ పెద్దఎత్తున తరలిస్తున్నారు.

● తప్పుడు బిల్లులతో ఇసుక రవాణా
● ప్రేక్షక పాత్రకు పరిమితమైన అధికార యంత్రాంగం

నకిలీలలు..!



ఒడిశా పేరిట జారీ చేసిన రసీదు

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం

● ఆమదాలవలస నియోజకవర్గంలో ఇసుక అక్రమాలు ఎక్కువగా జరుగుతున్నాయి. పాలకొండ, పాతపట్నం నియోజకవర్గాల్లోని కొన్ని మండలాల్లో ఇసుకను తోడేసి జాతీయ రహదారికి వచ్చే సరికి ఒడిశాలో అధికారికంగా నిర్వహిస్తున్న ర్యాంపు బిల్లులు చూపుతున్నారు. ఇలా రోజూ 50కి పైగా లారీలు విశాఖకు వెళ్తున్నాయి. ఈ వ్యవహారంలో రూ.లక్షలు చేతులు మారుతున్నాయి. అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండటం చర్చనీయాంశమవుతోంది.

జిల్లా నుంచి ఇసుక లారీలు విశాఖకు పైడిభీమవరం చెక్‌పోస్టు మీదుగా వెళ్తాయి. ఇక్కడ చోదకులు చాలా వరకు ఒడిశా బిల్లులు చూపుతున్నారు. ఇది అక్రమమా? సక్రమమా? అని తెలుసుకోవడం అధికారులకు సవాల్‌గా మారింది. ఒడిశా ప్రభుత్వం పేరిట ఉన్న బిల్లును పరిశీలిస్తే గుత్తేదారు పేరు, స్టాంపు, సంతకం ఉంటున్నాయి. దీనిపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే కొన్నింటికి లారీ నంబరు, ఎక్కడ నుంచి ఇసుక తీసుకున్నారు.. ఎక్కడికి తరలిస్తున్నారు వంటి వివరాలు వస్తున్నాయి. మరికొన్నింటిని పరిశీలిస్తే క్యూఆర్ కోడ్ స్కాన్ కాని పరిస్థితి. వీటిని కొందరు అధికారులు నకిలీ బిల్లులని చెబుతుంటే మరికొందరు ఒడిశా ఇసుక వివరాలు ఆన్‌లైన్‌లో తెలుసుకోలేమని అంటున్నారు. ఒడిశా పేరిట బిల్లు సృష్టిస్తే అధికారులు పట్టుకోలేరని తెలుసుకున్న అక్రమార్కులు బరి తెగిస్తున్నారు. గుర్తించే పరిస్థితి లేకపోవడంతో తనిఖీ కేంద్రం వద్ద పచ్చ జెండా ఊపుతున్నారు.

ఇలా చేస్తే మేలు..

ఒడిశా సరిహద్దు కొత్తూరు తదితర ప్రాంతాల్లోనూ తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. అటు వైపు నుంచి వస్తున్న లారీల వివరాలను పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద సరిచూస్తే అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయవచ్చు.

● ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు కలెక్టర్, ఎస్పీ పైడిభీమవరం వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. గత 20 రోజుల్లో 15కు పైగా నకిలీ బిల్లులు, రసీదులు లేని పలు వాహనాలను పట్టుకుని కేసులు నమోదు చేశారు. ఈ నెల 16న ఒడిశా పేరిట నకిలీ బిల్లులు సృష్టించి మూడు లారీల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని గుర్తించి కేసు నమోదు చేశారు. 8, 9 తేదీల్లోనూ వరుసగా లారీలను పట్టుకున్నారు. అధికారికంగా పట్టుకున్నవి పదుల సంఖ్యలో ఉంటున్నా రోజూ పెద్దఎత్తున నకిలీ బిల్లులతో చెక్‌పోస్టును దాటి వెళ్తున్నాయి.

ప్రతి వాహనం నంబరు నమోదు చేస్తున్నాం.. జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఒడిశా బిల్లులతో వచ్చేవి సరైనవా..కాదా? అని కనుగొనడానికి ఎలాంటి ప్రామాణిక విధానం లేకపోవడంతో ఇబ్బందులు వస్తున్నాయి. పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద ఒడిశా బిల్లుతో వచ్చే ప్రతి వాహనం నంబరు, ఇతర వివరాలను నమోదు చేసేలా చూస్తున్నాం. వారంలో ఒక రోజు ఒడిశా అధికారులను సంప్రదించి సేకరించిన వివరాలపై ఆరా తీసి చర్యలు తీసుకుంటాం. – స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కలెక్టర్



● మహిళలకు టోకరా వేసిన మాయలేడి
● దోపిడీలో వైకాపా నాయకుల హస్తం

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: ఓ బ్యాంకు వేసిన వేలంలో కొనుగోలు చేసిన బంగారు బిస్కెట్లు విక్రయిస్తున్నానని ఓ మాయలేడి అమాయక మహిళల నుంచి పెద్దఎత్తున నగదు వసూలు చేసి టోకరా వేసింది. ఆమెకు వైకాపాకు చెందిన పలువురు నాయకులు సహకరించారని సమాచారం. సార్వత్రిక ఎన్నికలకు ముందు జరిగిన ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

కిలో బంగారు బిస్కెట్లు రూ.10 లక్షలు..!

సంతబొమ్మాళి మండలం నౌపడ గ్రామానికి చెందిన ఓ మహిళ తన భర్త బ్యాంకులో పని చేస్తున్నారని.. బ్యాంకులో వేలం వేసిన బంగారు బిస్కెట్లను గతంలో పాడుకున్నానని, డబ్బులు అవసరమైనప్పుడు వాటిని విక్రయిస్తున్నట్లు పలువురిని నమ్మించింది. కిలో బంగారు బిస్కెట్లు రూ.10 లక్షలకే ఇస్తానని ఆశ చూపి నౌపడ, టెక్కలి, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు చెందిన మహిళల నుంచి రూ.కోటి పైగా కాజేసింది. నౌపడ గ్రామానికి చెందిన కె.భాగ్యలక్ష్మి నుంచి రూ.35 లక్షలు, బేబీ నుంచి రూ.20 లక్షలు, దాలమ్మ నుంచి రూ.2 లక్షలు, టెక్కలికి చెందిన పైల దమయంతి నుంచి రూ.37 లక్షలు వసూలు చేసింది. బంగారు బిస్కెట్లు ఇవ్వకపోవడంతో బాధితులు రెండు నెలల కిందట మాయలేడిని నిలదీశారు. తులం బంగారానికి రెండు తులాల బంగారం అందజేస్తానని.. బంగారం వద్దనుకుంటే డబ్బులు ఇస్తామని మరోమారు ఆశ చూపింది. ఇటీవల బాధిత మహిళలు ఒత్తిడి చేయడంతో టెక్కలి, పలాస, నరసన్నపేట, విశాఖపట్నంలోని బంగారం దుకాణాల్లో బిస్కెట్లు తయారవుతున్నాయని చెప్పింది. నగదు లేదా బంగారం అందకపోవడంతో కొందరు నాయకుల వద్ద కొన్ని రోజుల కిందట పంచాయితీ జరిగింది.

పోలీసులను ఆశ్రయించిన బాధితులు

మోసం విషయం బయటకు పొక్కకుండా ఉండేందుకు గతంలో కళాశాల ఛైర్మన్‌గా పని చేసిన ఓ వ్యక్తితో పాటు మరొకరు జాగ్రత్తలు తీసుకున్నారు. ఇందుకు వారు రూ.లక్షల్లో వసూలు చేశారు. దస్తావేజులు, ఈ-స్టాంప్ పేపర్లపై సంతకాలు చేయించడంలో వైకాపా నాయకులు కీలకంగా వ్యవహరించారు. సుమారు పది రోజుల కిందట నౌపడ, టెక్కలి మహిళలు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు మాయలేడిని పిలిపించగా బాధితులతో రాజీకి వచ్చి కొద్ది రోజుల గడువు కోరారు. ఇటీవల అది పూర్తవడంతో మహిళలు నిలదీస్తే దుర్భాషలాడుతూ ఎదురు దాడికి దిగింది. ఈ విషయమై నౌపడ ఎస్సై నారాయణస్వామిని 'న్యూస్‌టుడే' సంప్రదించగా బాధిత మహిళలు ముందుకొచ్చి ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు: 1,954	ప్రాథమికోన్నత: 268	ఉన్నత: 416	విద్యార్థులు: 1,74,015

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన ఆహారం అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మెనూలో మార్పులు చేయడానికి విద్యాశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వంటకాల జాబితాలో కొత్తవి తీసుకురానున్నారు. వైకాపా ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అస్తవ్యస్తంగా మార్చింది. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో మెనూ సక్రమంగా అమలు కాని పరిస్థితి నెలకొంది. వంట నిర్వాహకులు పెట్టిందే విద్యార్థులు తినాల్సిన పరిస్థితి.

■ మధ్యాహ్న భోజనంలో మార్పులు
■ పిల్లల అభిప్రాయాలతో
■ కలెక్టర్‌కు నివేదిక



విద్యార్థులు మెచ్చేలా మెనూ..!

న్యూస్‌టుడే, పొందూరు, ఆమదాలవలస గ్రామీణం, హిరమండలం

మధ్యాహ్న భోజన మెనూ మార్పు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరడంతో కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. జిల్లా స్థాయిలో చర్చించి మార్పులకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించింది. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అధికారులు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, పథకం నిర్వాహకులు, యాజమాన్య కమిటీ సభ్యులతో మాట్లాడి అభిప్రాయాలు సేకరించారు.

● గ్రామాల్లో వసతుల మేరకు నూతన మెనూ అమలుకు కసరత్తు చేస్తున్నారు. అన్నం, సాంబారు, గుడ్డుతో కూర, స్వీటు, జీరా రైస్‌తో పాటు పలు రకాలు అభిప్రాయాల్లో వ్యక్తమైనట్లు తెలిసింది. ఇప్పటికే సేకరించిన వివరాలను డీఈవో నివేదిక రూపంలో కలెక్టర్‌కు అందజేయగా ప్రభుత్వానికి పంపారు. రాష్ట్ర స్థాయిలో వచ్చిన అభిప్రాయాలను పరిశీలించి కొత్త మెనూ రూపొందిస్తారు. ఇప్పటికే ఈ ప్రక్రియ జోరుగా సాగుతోందని.. అతి త్వరలోనే కొత్త మెనూ అమలు చేయవచ్చని విద్యా శాఖ అధికారులు తెలిపారు.

● వైకాపా హయాంలో మధ్యాహ్న భోజనం తినడానికి విద్యార్థులు ఆసక్తి చూపేవారు కాదు. కొందరు ఇంటికి వెళ్లిపోవడం.. లేకపోతే ఇంటి నుంచి భోజనం తెచ్చుకోవడం చేసేవారు. ఈ పరిస్థితి తలెత్తకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పిల్లలు మెచ్చేలా కొత్త మెనూ ఉంటుందని.. ఆరోగ్యకరమైన పౌష్టికాహారం అందజేస్తారని దీంతో వారికి మేలు జరుగుతుందని విద్యా శాఖ అధికారులు అభిప్రాయపడ్డారు.

నివేదిక అందజేశాం..

ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యుల నుంచి కొత్త ఆహార పట్టికకు సంబంధించిన వివరాలపై అభిప్రాయాలను సేకరించాం. నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేశాం. – తిరుమల చైతన్య, డీఈవో, శ్రీకాకుళం

ఆన్‌లైన్‌లో కేజీబీవీ నియామకాల ప్రతిభా జాబితా

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లాలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో (కేజీబీవీ) బోధన, బోధనేతర సిబ్బంది నియామకానికి సంబంధించిన ప్రతిభా జాబితా http:tes.google.comite/deosklorg// వెబ్‌సైట్‌లో ఉంచామని డీఈవో ఎస్.తిరుమలచైతన్య తెలిపారు. సబ్జెక్టుల వారీగా తాత్కాలిక ప్రతిభా జాబితా అందుబాటులో ఉందన్నారు. అభ్యంతరాలు ఉంటే ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు సమగ్ర శిక్షా కార్యాలయంలో అందజేయాలన్నారు. 1:20 జాబితాలో ఉన్న అభ్యర్థులు ఈ నెల 21న ధ్రువపత్రాల పరిశీలనకు కార్యాలయంలో హాజరు కావాలన్నారు. ఉదయం 10 గంటలకు సీఆర్‌టీ తెలుగు, సాంఘిక, జీవశాస్త్రం సబ్జెక్టుల అభ్యర్థులు, మధ్యాహ్నం ఒంటిగంటకు అకౌంటెంట్లు, వార్డెన్, ఇతర పోస్టుల దరఖాస్తుదారులు హాజరుకావాలని డీఈవో తెలిపారు.

గ్రామం మధ్యలో మద్యం దుకాణం వద్దు



ఆబ్కారీ శాఖ అధికారులను ప్రశ్నిస్తున్న మహిళలు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: గ్రామం మధ్యలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే ఊరుకోబోమని ఎచ్చెర్ల మండలం చిలకపాలెం గ్రామ మహిళలు శుక్రవారం ఆందోళనకు దిగారు. చిలకపాలెం-మునిపేటకు వెళ్లే దారిలో గ్రామం మధ్యలో ఏర్పాటు చేసిన దుకాణాన్ని పరిశీలించడానికి శుక్రవారం ఆబ్కారీ శాఖ సీఐ గోపాలకృష్ణ వచ్చారు. విషయం తెలుసుకున్న స్థానిక మహిళలు ఆందోళనకు దిగారు. గ్రామం మధ్యలో మద్యం దుకాణం ఉంటే మహిళలు, చిన్నారులకు ఏవిధంగా రక్షణ ఉంటుందని అధికారులను నిలదీశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల మేరకు అనుమతులు ఇస్తామని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నచ్చజెప్పడంతో శాంతించారు.

తుపాను ప్రభావిత మండలాలకు ప్రత్యేకాధికారులు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లాలోని 11 తీర ప్రాంత మండలాలకు ప్రత్యేక పర్యవేక్షణాధికారులను నియమిస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా ఆయా మండలాల్లో విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను అప్రమత్తం చేయనున్నారు.

మండలం	ప్రత్యేకాధికారి	చరవాణి నంబరు
రణస్థలం	పీడీ డీఆర్‌డీఏ	80088 03800
ఎచ్చెర్ల	పీడీ డ్వామా	87900 08399
శ్రీకాకుళం	డీపీవో	83414 93877
గార	పీడీ ఐసీడీఎస్	94408 14582
పోలాకి	సీఈవో, జిల్లా పరిషత్తు	91009 97770
సంతబొమ్మాళి	జీఎం పరిశ్రమల శాఖ	98665 30885
వజ్రపుకొత్తూరు	డీడీ, మత్స్యశాఖ	94407 16028
సోంపేట	ఏడీ, కార్మికశాఖ	94925 55034
మందస	ఏడీ, పశుసంవర్ధకశాఖ, పలాస	94924 16700
కవిటి	ఉద్యాన శాఖ అధికారి	79950 86758
ఇచ్ఛాపురం	డ్వామా ఏపీడీ	63099 98070

విద్యార్థిని ఆత్మహత్య ఘటనపై నివేదిక అందించండి

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: పాతపట్నం ఏకలవ్య ఆదర్శ పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థిని వసతిగృహంలో ఆత్మహత్య చేసుకున్న ఘటనపై జిల్లా విద్యాశాఖ, ఐటీడీఏ అధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టి సత్వరమే నివేదిక అందజేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం శుక్రవారం ఆదేశాలు జారీచేశారు. దసరా సెలవుల అనంతరం పాఠశాలకు వచ్చిన బాలిక మృతికి గల కారణాలపై లోతుగా దర్యాప్తు చేయాలని తెలిపారు. నివేదిక ఆధారంగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో చర్యలు తీసుకోనున్నట్లు ఆయన వివరించారు.

అద్దెకు ఆర్టీసీ బస్‌స్టేషన్!

కొత్తూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర సరిహద్దులోని కొత్తూరు మండలం నివగాంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను అద్దె ప్రాతిపదికన ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారు. ఇక్కడకు బస్సులు రాకపోవడంతో నిరాదరణకు గురైంది. దీనిని స్థానికులు సొంత అవసరాలకు ఉపయోగించడంతో పాటు కొందరు మద్యం తాగడం వంటివి చేసేవారు. ప్రస్తుతం ఏకంగా పదేళ్ల కాల పరిమితితో నెలకు రూ.5 వేలు చొప్పున అద్దెకు అప్పగించారు. వాణిజ్య సముదాయంగా మార్చేందుకు పనులు చేపడుతున్నారు. ఈ విషయాన్ని శ్రీకాకుళం రెండో డిపో మేనేజర్ శర్మ వద్ద ప్రస్తావించగా ప్రయాణ ప్రాంగణంలోకి బస్సులు రాకపోవడంతో అద్దెకు ఇచ్చినట్లు తెలిపారు.


నివగాంలో వాణిజ్య సముదాయంగా మార్చేందుకు పనులు చేపడుతున్న వైనం

విభిన్న ప్రతిభావంతులు ఎందులోనూ తీసిపోరు


స్వాభిమాన్ కార్యక్రమంలో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: విభిన్న ప్రతిభావంతులు ఎందులోనూ తీసిపోరని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. స్వాభిమాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జడ్పీ సమావేశ మందిరంలో దివ్యాంగుల నుంచి జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలసి కలెక్టర్ వినతులు స్వీకరించారు. ప్రతి అర్జీని సంబంధిత అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ 'స్వాభిమాన్' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి బి.మీనాక్షి, రిమ్స్ సూపరింటెండెంట్ షకీలా, డీసీహెచ్ఎస్ కల్యాణ్‌బాబు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, డ్వామా పీడీ బి.సుధాకర్‌రావు, డీపీవో కె.భారతీసౌజన్య, జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజు, జిల్లా ఉపాధి కల్పనాధికారి సుధ పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ ఒప్పంద అధ్యాపకుల సంఘం కార్యవర్గం ఎన్నిక

వేంపల్లె, న్యూస్‌టుడే: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీల ఒప్పంద అధ్యాపకుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఇడుపులపాయలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బొజ్జా అనీల్‌కుమార్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ కార్యవర్గ ఎన్నిక శుక్రవారం ఇడుపులపాయలో నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా కోటేశ్వరరావు (ఒంగోలు), ప్రధాన కార్యదర్శిగా తేజాకిరణ్(శ్రీకాకుళం), సంయుక్త కార్యదర్శిగా నిర్మలాకుమారి(శ్రీకాకుళం), కార్యనిర్వాహక కార్యదర్శిగా శివకుమార్(నూజివీడు)లను ఎన్నుకున్నారు. అనీల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తామన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	150	255	275

సమస్యలుంటే నేరుగా సంప్రదించాలి


ఏఆర్ పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: పోలీసు సిబ్బందికి వ్యక్తిగత, ఆరోగ్య, ఉద్యోగరీత్యా సమస్యలు ఉంటే నేరుగా సంప్రదించాలని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం ఎచ్చెర్లలోని జిల్లా సాయుధ పోలీసు దళం కార్యాలయం ఆవరణలో ఉన్న సామాజిక భవనంలో ఏఆర్ పోలీసుల పిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని, అత్యవసరమైనప్పుడు చరవాణిలో సమస్యలను తెలిపితే అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఆర్ఐ కె.నర్సింగరావు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపుల పరిశీలన


బూరవిల్లిలో సిబ్బందికి సాంకేతిక పరికరాలు అందజేస్తున్న డీడీ మోహనరావు, తహసీల్దారు రమణారావు

గార, న్యూస్‌టుడే: గార మండలం బూరవిల్లి, జోగిపంతులుపేట ప్రాంతాల్లో వంశధార నదిలో ఇసుక ర్యాంపులను భూగర్భ గనుల శాఖ డీడీ మోహనరావు, తహసీల్దారు రమణారావు పరిశీలించారు. అనంతరం సిబ్బందికి సాంకేతిక పరికరాలు అందజేశారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఆన్‌లైన్, మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఆఫ్‌లైన్‌లో నమోదు ఉంటుందని, ఆఫ్‌లైన్లో నమోదు చేసిన సమాచారం మరుసటి రోజు ఆన్‌లైన్‌లో సిబ్బంది పొందుపరచాలని అధికారులు చెప్పారు.

వేట లేక.. పూట గడవక..!

ఈ ఏడాది వరుస తుపాన్లు

మత్స్యకారులకు తప్పని ఇబ్బందులు

న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

కడలిని నమ్ముకుంటున్న మత్స్యకారుల బతుకు రోజు రోజుకు భారంగా మారుతోంది. సముద్రంలో ఏర్పడుతున్న ప్రతికూల వాతావరణ పరిస్థితులు, చేపల ధర తగ్గదల వారి జీవన విధానాన్ని దెబ్బతీస్తున్నాయి. వేట సాగక, పూట గడవక అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారు. జిల్లాలో డొంకూరు, బారువ, నువ్వలరేవు, భావనపాడు, గెద్దలపాడు, రాజారాంపురం, కళింగపట్నం, గుళ్లవానిపేట తదితర ఫిష్ ల్యాండింగ్ సెంటర్లలో ప్రతి రోజు మత్స్యకారులు వేటకు వెళ్తుంటారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వేటకు అనుకూలంగా ఉంటే మత్స్య సంపద ఎక్కువ లభిస్తుంది. ఈ ఏడాది అంతా తుపాన్లు, వాయుగుండాలతో సముద్రం అల్లకల్లోలంగా మారడంతో పూర్తిస్థాయిలో వేట సాగిన పరిస్థితి లేదు. దీంతో గంగపుత్రుల ఆశలు అడియాశలయ్యాయి.


భావనపాడులో నిలిచిపోయిన బోట్లు

రాయితీ పెంచాలి

మత్స్యకారులకు బోట్లు నడిపేందుకు వాడే ఇంధనానికి ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. లీటర్ పెట్రోల్ ధర రూ.50 ఉన్నప్పుడు అందిస్తున్న దానినే ప్రస్తుతం ఇస్తున్నారు. వేట ఇబ్బందిగా మారి నష్టాలు చవిచూస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో రాయితీ రూ.9 నుంచి 20కి పెంచాలని, అందించే ఇంధనం 300 లీటర్ల నుంచి 600కు పెంచి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఏడాదంతా నిరాశే

ఈ ఏడాది వరుస తుపాన్లు, వాయుగుండాలతో వేటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. భావనపాడు సముద్ర తీరంలో ఇసుక మేట వేయడంతో జూన్, జులై నెలల్లో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. మధ్యవర్తుల ద్వారా తీసుకున్న అప్పులు అలాగే మిగిలిపోయాయి. ప్రభుత్వం స్పందించి రాయితీ పెంచడంతో పాటు మత్స్యకారులను ఆదుకోవాలి. - జి.ఆదినారాయణ, మత్స్యకారుడు, భావనపాడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

ప్రస్తుత పరిస్థితులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. - ధర్మరాజు పాత్రో, ఎఫ్‌డీవో, టెక్కలి

జిల్లాలో వివరాలు ఇలా..
- మత్స్యకార గ్రామాలు: 104
- మర బోట్లు: 1,820
- సాధారణ పడవలు: 5,070
- వేటపై ఆధారపడిన కుటుంబాలు: సుమారు 30 వేలు

నాణ్యమైన విత్తనాలు అందజేయాలి

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: రబీ సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందజేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం వ్యవసాయశాఖ అధికారులు, డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే పలువురు డీలర్లపై జరిమానాలను విధించినట్లు పేర్కొన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ రబీలో 77,176 హెక్టార్లలో సాగుకు అంచనా వేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి 40,225 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం 9,793 టన్నులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి, సహకార అధికారి బి.నగేష్, డీసీసీబీ సీఈవో వరప్రసాద్, మార్క్‌ఫెడ్ మేనేజర్ రమణి పాల్గొన్నారు.

నిపుణుల సూచనలతో పకడ్బందీగా ప్రణాళిక

- 'విశాఖ గ్రోత్ హబ్ ప్రాజెక్టు'పై నీతి ఆయోగ్ సీఈవో సమీక్ష


అధికారులతో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ, సమీప జిల్లాలకు రూపొందిస్తున్న అభివృద్ధి ప్రణాళికలపై నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం సమీక్షించారు. ఆయా జిల్లాల్లో ఏ రంగాలను కొత్తగా గుర్తించి వృద్ధిలో భాగస్వామ్యం చేయొచ్చో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు రూపొందించిన ప్రణాళికల స్థితిగతులపై చర్చించారు. విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) సమావేశం మందిరంలో శుక్రవారం నీతి ఆయోగ్ ఆధ్వర్యంలోని 'విశాఖ గ్రోత్ హబ్ ప్రాజెక్టు' రూపకల్పనపై పలు జిల్లాల కలెక్టర్లు, కమిటీ సభ్యులు ఇతర ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. విశాఖ, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఉన్న అవకాశాలు, సహజవనరుల లభ్యత, సేవా రంగాల పరిస్థితి, వ్యవసాయ, ఆహార సంబంధ పరిశ్రమల స్థితి వాటి అనుకూల, ప్రతికూల అంశాలపై చర్చించారు. ఆయా జిల్లాల్లో ఏ రంగాలను ప్రోత్సహిస్తే ఏవిధమైన అభివృద్ధి జరుగుతుందో అధికారులు తెలియజేశారు. ఆయా అంశాలపై సంబంధిత రంగాల నిపుణులతో చర్చించి నవంబరు నాటికల్లా ఒక విధానం రూపొందించాలని సీఈవో సూచించారు. వారణాసి, ముంబయి, సూరత్ ప్రాంతీయ ప్రణాళికల రూపకల్పన చివరి దశలో ఉన్నాయని, విశాఖది మాత్రం మధ్య దశలోనే ఉందన్నారు. జనవరి నాటికల్లా దీనికి తుది రూపు తీసుకురావాల్సి ఉందని స్పష్టం చేశారు.

అవినీతి సర్పంచి వద్దంటూ నిరసన


కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఇల్లాయిపురం పంచాయతీ వాసులు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: మెళియాపుట్టి మండలం ఇల్లాయిపురం పంచాయతీ సర్పంచి అవినీతిపరుడని ఉపసర్పంచి, పంచాయతీ వాసులు ఆరోపించారు. ఆయనను తక్షణమే తొలగించాలని కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోడు భూములకు పట్టాలు ఇప్పిస్తామని 30 మంది వద్ద రూ.10వేలు చొప్పున రూ.1.50 లక్షలు వసూలు చేశారని విమర్శించారు. గ్రీన్ అంబాసిడర్‌గా పనిచేస్తున్న కార్మికుల వద్ద ఇళ్లు ఇప్పిస్తామని రూ.10 వేలు చొప్పున తీసుకున్నారన్నారు. ఉపసర్పంచి సీహెచ్.లక్ష్మి, ఎం జయమ్మ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాల నాటికల పోటీలు ప్రారంభం

శ్రీకాకుళం సాంస్కృతికం న్యూస్‌టుడే: నగరంలో బాపూజీ కళామందిరంలో సూత్రా ఫౌండేషన్, సుమిత్రా కళాసమితి సంయుక్త నిర్వహణలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నాటిక పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం పూర్వ అధ్యక్షురాలు పైడిశెట్టి జయంతి ముఖ్య అతిథిగా, విశ్రాంత అధికారులు సురంగి మోహనరావు, పి.ఎం.జె.బాబు, కె.సోమేశ్వరరావు, లోకనాథం నందికేశ్వరరావు ఆత్మీయ అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇప్పిలి శంకరశర్మ, నిక్కు హరిసత్యనారాయణ మాట్లాడారు. ఆమదాలవలస వెంకటేశ్వర కళామండలి కుప్పిలి వెంకటరాజారావు దర్శకత్వంలో 'పులికాలం' నాటిక, మీగడ రామలింగస్వామి రాసిన అంతర్ముఖం నాటికను పట్టాభిరామారావు దర్శకత్వంలో మందస అభినయ ప్రియ నాటక నర్తనశాల బృందం వారు ప్రదర్శించారు.


అంతర్ముఖం నాటిక ప్రదర్శన

మురుగునీటిలో పడి వ్యక్తి మృతి

- సగం కాలిన మృతదేహం పోస్టుమార్టంకు తరలింపు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక మండాపోలం కాలనీ నాలుగో వీధిలో మురుగునీటిలో పడి భూలోకమాత వీధికి చెందిన నాగవంశం రుషికేశ్(42) మృతి చెందాడు. శుక్రవారం ఉదయం ఓ ఇంటి పునాదుల మధ్య నిలిచి ఉన్న నీటిలో మృతదేహాన్ని గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చేలోపే అక్కడికి చేరుకున్న బంధువులు మృతదేహానికి అంత్యక్రియలు చేసేందుకు ప్రయత్నించారు. దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకొని సగం కాలిన మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు. అవివాహితుడైన ఇతడు స్థానికంగా ఓ పువ్వుల విక్రయ దుకాణంలో పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి సమీప ప్రాంతంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేస్తున్నారన్న సమాచారంతో అతడు అక్కడి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ఆ వైపునకు వచ్చి ప్రమాదానికి గురైనట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే పోలీసులు మాత్రం దీన్ని ధ్రువీకరించలేదు.

ఆర్టీసీ డ్రైవరుపై దాడి

హిరమండలం, న్యూస్‌టుడే: కొత్తూరు నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో డ్రైవరుపై శుక్రవారం ఒక వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. బస్సు ఎక్కేందుకు చేయి ఎత్తి ఆపినా డ్రైవరు ఆపకుండా వెళ్లాడని ఆగ్రహించిన యువకుడు ద్విచక్ర వాహనంతో వెంబడించి హిరమండలం బస్టాండు వద్ద ఆగి ఉన్న బస్సులో డ్రైవరుపై దాడికి పాల్పడినట్లు తెలిసింది. ఈ విషయంపై డ్రైవరు, కండక్టర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చేందుకు సిద్ధమవుతుండగా కొంత మంది పెద్దలు జోక్యం చేసుకొని రాజీ చేసినట్లు తెలియవచ్చింది. ఈ విషయమై ఎస్సై మహమ్మద్ యాసిన్ స్పందిస్తూ ఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

గంజాయి పట్టివేత.. అదుపులో నలుగురు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరం విజయాదిత్య ఉద్యానం సమీపంలో నలుగురి వ్యక్తుల నుంచి శుక్రవారం కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు రెండో పట్టణ సీఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. సదరు వ్యక్తులు గంజాయిని అమ్మడానికి వెళ్తుండగా రెండో పట్టణ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి సరకు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. నలుగురిలో ముగ్గురు జిల్లాకు చెందిన వారు కాగా, ఒకరు విశాఖకు చెందిన వ్యక్తిగా సమాచారం.

టెక్కలిలో చోరీ


దుండగులు తెరిచిన బీరువా

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక ఎన్టీఆర్‌నగర్‌లోని అయిదో లైనులో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఆ ప్రాంతంలో అద్దెకు నివాసం ఉంటున్న దొంతుకుర్తి యమున ఇంటి తాళాలు పగులగొట్టిన దుండగులు లోపలకు చొరబడ్డారు. రెండు బీరువాలను తెరిచి వాటిలోని మూడు తులాల బంగారు గొలుసు, రెండు బంగారు శతమానాలు, రూ.60 వేల నగదు ఎత్తుకెళ్లారు. స్థానిక జిల్లా ఆసుపత్రిలో జనరల్ డ్యూటీ అటెండెంట్‌గా పనిచేస్తున్న ఈమె నైట్ డ్యూటీకి వెళ్లిన సమయంలో చోరీ జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఆమె ఇంటికి చేరుకొని కన్నీరు మున్నీరైంది. తొలుత 20 తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదు పోయినట్లు అంతా భావించారు. క్లూస్ టీం ఘటనా స్థలానికి చేరుకొని బీరువాలను పరిశీలించారు. రహస్య అల్మారాను దుండగులు తెరవకపోవడాన్ని గుర్తించారు. చోరీ జరిగిన సమయంలో మేడపైన ఉన్న మరో ఇంటి నుంచి ఓనర్లు బయటకు రాకుండా దుండగులు బయట గడియపెట్టి జాగ్రత్తపడ్డారు. సీసీఎస్ సీఐ సూర్యచంద్రమౌళి ఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలను పరిశీలించారు. టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీకి పాల్పడిన ఇద్దరు మహిళల అరెస్టు


మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

పొందూరు, న్యూస్‌టుడే: పొందూరు మండల కేంద్రంలోని తిరుమల బంగారం, వెండి ఆభరణాల దుకాణంలో చోరీకి పాల్పడిన ఇద్దరు మహిళలను రాపాక కూడలి వద్ద శుక్రవారం అరెస్టు చేసి.. చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పి.సత్యనారాయణ, ఎస్సై సత్యనారాయణ తెలిపారు. వారి వివరాల ప్రకారం.. ఈ నెల 9న విశాఖపట్నం అల్లిపురానికి చెందిన షేక్‌బాను, దేశిరాజు ధనలక్ష్మి పొందూరులోని ఆభరణాల దుకాణానికి కొనుగోలుకు వచ్చినట్లు నమ్మించి సుమారు 60 తులాల వెండి పట్టీలను దొంగిలించారు. దుకాణ యజమాని సీసీ టీవీ ఫుటేజీలో చూసి.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా మహిళలను గుర్తించి ఆభరణాలు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

పలాస
• పలాస • ఇచ్ఛాపురం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం : 9440437129
పలాస : 6008574279
కవిటి గ్రామీణం : 6309638675
పలాస గ్రామీణం : 7386408926
కంచిలి గ్రామీణం : 9704598738

సమస్య : ఇచ్ఛాపురం కార్పొరేషన్ కూడలిలో మంచినీటి సరఫరా వాల్వు గుంతపై సిలబ్ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. - బి.సీతారామయ్య, ఇచ్ఛాపురం

సమాధానం : పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. - ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం

- న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

? పలాస మండలం బ్రాహ్మణతర్లా కది వీధి వద్ద రోడ్డు పక్కనే చెత్త పడేస్తుండటంతో ఇబ్బంది పడుతున్నాం. - స్థానికులు

● రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం. - లక్ష్మణరెడ్డి పంచాయతీ కార్యదర్శి, బ్రాహ్మణతర్లా

- న్యూస్‌టుడే, పలాస గ్రామీణం



చట్ట పరిధిలో దర్యాప్తు: ఎస్పీ

ప్రజా ఫిర్యాదుల స్వీకరణలో వచ్చిన వినతులపై త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. కాశీబుగ్గ పోలీస్ ఠాణాలో శుక్రవారం ఎస్పీ నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో 11 వినతులు వచ్చాయి. ఆయన మాట్లాడుతూ.. ప్రతి సమస్యను చట్ట పరిధిలో దర్యాప్తు చేపట్టి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీస్ పరిధి ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. - న్యూస్‌టుడే, కాశీబుగ్గ



విద్యార్థుల ప్రతిభ భళా

పలాస పట్టణం ఇందిరానగర్‌లోని గౌతమ్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా అంతర్జాలం వినియోగం, దాని వల్ల కలిగే లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం వంటి అంశాలపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థినిలు టి.ఇందు(ప్రథమ), కె.తేజస్విని(ద్వితీయ), పి.లిఖిత(తృతీయ) గెలుపొందారు. విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ దుర్గాప్రసాద్ పాత్రో, ప్రధానోపాధ్యాయురాలు ఆర్.శ్రీదేవి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.లక్ష్మణరావు, డి.వైకుంఠరావు, వి.వెంకటేశ్ పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, పలాస



న్యూస్‌టుడే, పలాస

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో ఆదాయం తెచ్చిపెట్టే వార్డుల్లో శివాజీనగర్ ముందంజలో ఉన్నా మౌలిక సదుపాయాల కల్పనలో వెనుకబడింది. ఈ ప్రాంతం శరవేగంగా విస్తరిస్తోన్నప్పటికీ ఇంకా మట్టి రహదారులే దర్శనమిస్తున్నాయి. మురుగు సమస్య పట్టిపీడిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఈ వార్డు అభివృద్ధికి అడుగులు పడలేదు. కూటమి ప్రభుత్వమైనా తమ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు వేడుకుంటున్నారు.



శివాజీనగర్‌లో మట్టి రహదారి

ఇది శివాజీనగర్ వార్డు దుస్థితి

ఆదాయంలో ముందు.. సమస్యల పరిష్కారంలో వెనుకే

నేటికీ మట్టి రహదారులే..

పురపాలక సంఘం 20వ వార్డులో ఉన్న శివాజీనగర్‌లో సుమారుగా 24 వీధులు ఉండగా, 3500 మంది జనాభా, 1290 మంది ఓటర్లు ఉన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి నుంచి ప్రధాన వీధితోపాటు మరో 4 చోట్ల మాత్రమే సీసీ రహదారులు నిర్మించారు. మిగతా ప్రాంతాల్లో ఇప్పటికీ మట్టిరోడ్లు దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి వర్షం పడితే అవి బురదమయంగా మారి రాకపోకలకు ఆటంకంగా తయారవుతున్నాయి. మదర్ థెరిసా విద్యాలయం నుంచి శివాజీనగర్‌కు వచ్చే రహదారి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉండటంతో రోడ్డు వేసేందుకు వెనుకడుగు వేయాల్సి వస్తోంది.

అనుసంధానం లేని కాలువలు

శివాజీనగర్ వీధుల్లో నుంచి వచ్చే మురుగు కాలువల ద్వారా పెద్ద కాలువల్లోనికి చేరేలా అనుసంధానం లేకపోవటంతో అదంతా ఆర్టీసీ డిపోలోకి చేరుతోంది. ఇళ్ల నిర్మాణ సమయంలో కాలువల నిర్మాణం సక్రమంగా చేపట్టలేదు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరదనీటితోపాటు మురుగునీరంతా డిపోలోనికి వెళ్తుండటంతో ఉద్యోగులకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన కాలువల నిర్మాణం చేపట్టినా వాటి ఎత్తు తక్కువగా ఉండటంతో మురుగునీరు ప్రధాన కాలువల్లోకి చేరేందుకు అవకాశం లేకుండాపోయింది.

అంగన్‌వాడీ కేంద్రం లేదు

శివాజీనగర్‌లో 3500 మంది జనాభా నివసిస్తుండగా ఈ ప్రాంతంలో చిన్నారుల కోసం అంగన్‌వాడీ కేంద్రం లేకపోవటంతో చిన్నారులు, గర్భిణులు పౌష్టికాహారానికి నోచుకోని దుస్థితి. కొంత మంది గర్భిణులు సమీపంలో ఉండే ఇతర కేంద్రాల వద్దకు వెళ్లాల్సి వస్తుండటంతో ఇక్కట్లు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం చేయాలని, ప్రధానంగా ఇక్కడ అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేసేలా పాలకులు చొరవ చూపాలని పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కోఆప్షన్ సభ్యుడు బి.సంతోష్‌కుమార్ కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

శివాజీనగర్‌లో రోడ్లు, కాలువల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. ఆర్టీసీ మురుగునీరు సమస్యపై ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందించాం. ఆ ప్రాంతంలో పర్యటించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. - ఎన్.రామారావు, కమిషనర్, పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం



ఆర్టీసీ డిపోలోకి చేరుతున్న మురుగునీరు

లోక్ అదాలత్ కేసుల పరిష్కారానికి చర్యలు



సమావేశంలో అదనపు జిల్లా జడ్జి, సివిల్‌జడ్జి పోలీసు అధికారులు

సోంపేట, న్యూస్‌టుడే: డిసెంబర్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టాలని సోంపేట ఆరో అదనపు జిల్లా జడ్జి కె.కోర్‌టాలు సూచించారు. కోర్టు ప్రాంగణంలో శుక్రవారం ఇచ్ఛాపురం జూనియర్ సివిల్ జడ్జి పి.పరేష్‌కుమార్‌తో కలిసి లోక్ అదాలత్ నిర్వహణపై చర్చించారు. కంచిలి, సోంపేట, బారువ, మందస సీఐ, ఎస్‌ఐ ఇతర అధికారులతో మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ల వారీగా రాజీకి అనుకూలమైన కేసులన్నీ పరిష్కారం చేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎక్సైజ్ కేసుల గురించి ఆరా తీశారు.

ఏపీటీపీసీ ఛైర్మన్‌ను కలిసిన పరిశ్రమల శాఖ అధికారులు

పలాస, న్యూస్‌టుడే: రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావును జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు శుక్రవారం పలాసలో కలిశారు. జిల్లా జాయింట్ డైరెక్టర్ అండ్ జనరల్ మేనేజర్, అసిస్టెంట్ డైరెక్టర్, ప్రమోషన్ అధికారుల బృందం పలాస క్లస్టర్‌లో కొత్త పరిశ్రమల ఏర్పాటు కోసం చర్చించారు.

పల్లె పండగతో ప్రగతికి బాటలు



ఇచ్ఛాపురం మండలం పాయితారిలో జనసేన నాయకుడు దాసరి రాజు తదితరులు

ఇచ్ఛాపురం గ్రామీణం, కంచిలి గ్రామీణం, వజ్రపుకొత్తూరు, కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లె పండగతో ప్రజలకు సకల సౌకర్యాలు ఏర్పాటవుతాయని కూటమి నాయకులు అన్నారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల వ్యాప్తంగా కూటమి నాయకులు, అధికారులు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.

పొదలతో ప్రమాదం..



కంచిలి మండల పరిధి మకరాంపురం కూడలి నుంచి బి.గొనపపుట్టుగ వరకూ రహదారికి ఇరువైపులా పొదలు పెరిగిపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు పొదలు అడ్డుగారావడంతో ప్రమాదాలకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికార్లు స్పందించి పొదలు తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయం ఆ శాఖ ఏ.ఈ విక్రమ్ వద్ద ప్రస్తావించగా త్వరలోనే పొదల తొలగింపు పనులు చేపడతామన్నారు.

– న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

వృథాగా మహిళా సాధికార భవనం

కవిటి మండలం బెజ్జిపుట్టుగలో మహిళా సంఘాల సమావేశాలకు నిర్మించిన సాధికార కేంద్రం భవనం ప్రస్తుతం వృథాగా దర్శనమిస్తోంది. గతంలో ఈ భవనంలో ప్రతి నెలా స్వయం శక్తి సంఘాల సమావేశాలు నిర్వహించి ఆయా సంఘాల రికార్డులను భద్రపరిచేవారు. వైకాపా ప్రభుత్వం వచ్చిన తరువాత వాటి గురించి పట్టించుకోకపోవడంతో కొన్నేళ్లుగా భవనం వృథాగా ఉంది. ఏపీఎం గోవిందరావు వివరణ ఇస్తూ.. పెచ్చులూడి శిథిలావస్థకు చేరడంతో సమావేశాలను మరో సామాజిక భవనంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం



కంచైనా ఏర్పాటు చేయండి



పలాస మండలం కొబ్బరిచెట్లూరులోని ప్రధాన వీధిలో రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్తు నియంత్రిక తక్కువ ఎత్తులో ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చిన్నారులు ఆడుకుంటూ ఆ వైపుగా వెళ్తుంటారని, జరగరానిదే ఏదైనా జరిగితే పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయంపై సహాయక లైన్‌మేన్ సంతోష్ వివరణ ఇస్తూ.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

– న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

శిథిల భవనాన్ని తొలగించరూ!

వజ్రపుకొత్తూరు మండలం సుంకరజగన్నాథపురంలో 35 ఏళ్ల కిందట నిర్మించిన తుపాన్ రక్షిత భవనం ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఈ భవనం ఉండటంతో ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే భవనం లోపల స్లాబు పెచ్చులూడి పడటంతోపాటు పొదల మధ్య నిరుపయోగంగా మారంది. తక్షణమే ఈ భవనాన్ని తొలగించాలంటూ గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ సీతారామయ్య మాట్లాడుతూ..పరిశీలించి భవనాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం



రాళ్లు తేలి..గుంతలు పడి



కాశీబుగ్గ పెట్రోల్ బంకు నుంచి తాళబద్ర రైల్వేగేటు వరకు వజ్రపుకొత్తూరు మండలంతోపాటు పురపాలక సంఘంలో గ్రామాలకు ప్రధాన రహదారి ఇది. వైకాపా ప్రభుత్వ హయంలో ఈ రోడ్డు నిర్మాణానికి పనులు చేపట్టారు. గుత్తేదారుడికి సకాలంలో నిధులు చెల్లించకపోవటంతో రహదారిని ఇలా అధ్వానంగా వదిలేశారు. ఈ మార్గంలో ప్రయాణించాలంటే భయపడాల్సి వస్తోందని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు. గుత్తేదారుడికి బిల్లులు చెల్లించకపోవటంతో పనులు నిలిపివేశారు. ఇటీవలే కొంత బిల్లు జమచేశాం. త్వరలోనే పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆర్అండ్‌బీ జేఈ విక్రమ్ తెలిపారు. – న్యూస్‌టుడే, పలాస

పొడతెగులుపై అవగాహన అవసరం

కంచిలి గ్రామీణం, ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: కంచిలి మండల పరిధిలోని అంపురంలో వ్యవసాయాధికారి బి.ధనుంజయ ఆధ్వర్యంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యాప్తంగా పొలాల్లో విస్తరిస్తున్న దోమపోటు, పొడతెగులుపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు. ● జీఏపీ (గుడ్ ఎగ్రికల్చరల్ ప్రాక్టీస్) పొలంబడితో రైతులకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయాధికారిణి భార్గవి పేర్కొన్నారు. ఇచ్ఛాపురం మండలం మశాఖపురంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు.



మశాఖపురంలో వ్యవసాయాధికారిణి భార్గవి, రైతులు

పోషకాహారంతోనే ఆరోగ్యం



పలాస లేబర్‌కాలనీలో..

ఇచ్ఛాపురం, ఇచ్ఛాపురం గ్రామీణం, కవిటి, కవిటి గ్రామీణం, పలాస, న్యూస్‌టుడే: మునగ ఆకులతో తయారుచేసి పొడిని తరచూ ఆహారంలో తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని, గర్భిణులకు ఇది ఎంతో మేలు చేస్తుందని సీడీపీవో పి.నాగరాణి, తెదేపా నాయకులు గాలి పాపారావు అన్నారు. పురుషోత్తపురం అంగన్‌వాడీ సంయుక్త కేంద్రంలో శుక్రవారం పోషకాహారంపై అవగాహన, సామూహిక సీమంత కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా ఆకుకూరలతోపాటు మునగాకు పొడిని ప్రదర్శించారు. అంగన్ కార్యకర్త సుబ్బలక్ష్మి ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ● పోషకాహారం తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్ వైజర్ పల్లవి అన్నారు. కవిటి సెక్టర్ గొండ్యాల పుట్టుగ అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కల్పించారు. ● పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో 20వవార్డు లేబర్‌కాలనీలో పౌష్టికాహారం పంపిణీచేశారు.



పురుషోత్తపురంలో సామూహిక సీమంతాలు

లేఅవుట్ ప్రాంతం పరిశీలన



కాశీబుగ్గ, న్యూస్‌టుడే: పలాస-కాశీబుగ్గ పట్టణాల పరిధిలోని నెమలికొండ ప్రాంతాన్ని రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పరిశీలించారు. శుక్రవారం 'కొండను తొలిచి..లేఅవుట్‌గా మలిచి' శీర్షికన 'ఈనాడు'లో వచ్చిన కథనంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. ఆర్ఐ నిరంజన్, సర్వేయర్ గిరిబాబు, వీఆర్వోలు అప్పలనాయుడు, ఖగేశ్వరరావు, అప్పారావు, భీమారావు, ఏఎస్ఐ ప్రకాశరావులు లేఅవుట్ ప్రాంతాన్ని పరిశీలించారు ఆ సమయంలో జేసీబీ, ట్రాక్టర్లతో జరుగుతున్న పనులను నిలిపివేయించి అక్కడ నుంచి పంపించేశారు. తహసీల్దార్ కల్యాణచక్రవర్తి మాట్లాడుతూ ఈ అంశంపై నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

స్పందనకు వందనం

మోటార్లు బాగుచేశారు..

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం పురపాలకసంఘంలో మూడు రోజులుగా కుళాయినీరు సక్రమంగా రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 'మూడు రోజులుగా దాహం.. దాహం' శీర్షికన 'ఈనాడు'లో శుక్రవారం వచ్చిన కథనంపై అధికారులు సత్వర చర్యలు చేపట్టారు. మోటార్లు, ఇతర ఉపకరణాలకు మరమ్మతు చేయించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అయితే ఊటబావుల్లోకి నీరు తక్కువగా చేరుతుండటంతో ప్రస్తుతం రెండు రోజులకు ఒకసారి నీటి సరఫరా చేయడం జరుగుతుందని కమిషనర్ నల్లి రమేష్ తెలిపారు.

కాలువలు శుభ్రం

పలాస, న్యూస్‌టుడే: పలాస పురపాలక సంఘం కోమటి వీధిలో కాలువలను శుభ్రం చేశారు. 'దుర్వాసన భరించలేకున్నాం' పేరిట శుక్రవారం ఈనాడులో వచ్చిన వార్తపై పారిశుద్ధ్య విభాగ అధికారులు స్పందించారు. కాలువల్లో అడ్డంగా నిలిచిపోయిన చెత్తను తొలగించి కాలువలో మురుగునీరు వెళ్లేలా చర్యలు చేపట్టారు.

యువతి అదృశ్యం

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కాశీబుగ్గ పట్టణానికి చెందిన ఓ యువతి కనిపించడం లేదని శుక్రవారం ఫిర్యాదు అందినట్లు సీఐ మోహనరావు పేర్కొన్నారు. ఈ నెల 16న టైలరింగ్ దుకాణానికి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిగిరి రాలేదని, యువతి కుటుంబీకులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు.

బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: జనసేన నియోజకవర్గ సమన్వయకర్త దుర్గారావును కొంతమంది బెదిరిస్తున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ ఆ పార్టీకి చెందిన పలువురు డిమాండ్ చేశారు. కాశీబుగ్గలో ఎస్పీ మహేశ్వరరెడ్డిని శుక్రవారం కలిసి ఫిర్యాదు చేశారు. పోలీస్ ఠాణా బయట ప్లకార్డులు ప్రదర్శించారు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జనసేన కార్యకర్తలు

జనసేన నాయకులు కోన కృష్ణారావు, ఎల్.సురేష్, వంశీకృష్ణ చౌదరి, గణపతిరావు, తేజేశ్వరరావు పాల్గొన్నారు

న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

ప్రభుత్వ పాఠశాలల్లో సైకిళ్లకు రక్షణ కరవైంది. పాఠశాల పరిధిలోని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు సైకిళ్లపై వస్తుంటారు. వాటిని భద్రపరిచేందుకు స్కూళ్ల ఆవరణలో షెడ్లు లేకపోవడంతో చెట్ల నీడన, ఆరు బయట ఉంచుతున్నారు. దీంతో ఎండా వానలకు అవి మరమ్మతులకు గురవుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు.



రాజపురం ఆదర్శ పాఠశాల వద్ద షెడ్డు లేక ఆరుబయట ఉన్న సైకిళ్లు

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..

నియోజకవర్గంలో..

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కవిటి, ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట మండలాల్లో 60 ఉన్నత పాఠశాలల్లో సుమారు 25,245 మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో సగానికి పైగా విద్యార్థులు సైకిళ్లపైనే పాఠశాలలకు రాకపోకలు సాగిస్తున్నారు. ఆయా బడుల్లో సైకిల్ షెడ్లు లేక వాటిని ప్రహరీ పక్కన, మైదానాల్లో, చెట్ల నీడల్లో నిలుపుతున్నారు. దీంతో సాయంత్రం ఇళ్లకు వెళ్లేటప్పుడు సైకిళ్లు మరమ్మతులకు గురవుతున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి సైకిల్ షెడ్లు నిర్మించాలని కోరుతున్నారు.

మరమ్మతులకు గురవుతున్నాయి

మా పాఠశాలలో సైకిళ్లు ఉంచేందుకు షెడ్డు లేదు. ముందుగా వస్తే చెట్టు నీడలో, ఆలస్యం అయితే ఎండలోనే ఉంచుతున్నాం. సాయంత్రం పాఠశాల విడిచిపెట్టే సమయంలో సైకిల్ చక్రాలకు గాలి తగ్గిపోవడంతో మరమ్మతులకు గురై ఇబ్బంది పడుతున్నాం. – డి.ప్రశాంత్, ఆదర్శ విద్యార్థి, రాజపురం

ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్తాం

ప్రభుత్వ పాఠశాలల్లో సైకిల్ షెడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. కొన్ని పాఠశాలల్లో దాతల సహకారంతో ప్రధానోపాధ్యాయులు షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చిన తరువాత శాశ్వత షెడ్లు నిర్మిస్తాం. – మజ్జి ధనుంజయ ఎంఈవో, కవిటి

రైల్వే అండర్ పాసేజ్‌కు మోక్షం



స్థానిక సంఘ ప్రతినిధికి సమస్య వివరిస్తున్న రైల్వే ఇంజినీర్ సత్యనారాయణ పాఢి

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఖుర్దా డివిజన్, పలాస రైల్వే సివిల్ ఇంజినీర్ సత్యనారాయణ పాఢి శుక్రవారం ఇచ్ఛాపురం చేరుకుని అండర్ పాసేజ్ నిర్మించాల్సిన ప్రాంతాన్ని పరిశీలించారు. రైలు పట్టాలకు దిగువ వంతెనలాంటి అంతర్గత పాసేజ్ దానికి ఇరువైపులా రహదారుల నిర్మాణం చేపట్టేందుకు పురపాలకసంఘం తీర్మానం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ అనుసంధాన మార్గం కోసం కాలనీలో ఓ ఇంటిని తొలగించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైలు యూజర్స్ కమిటీ ప్రతినిధులకు పలు సూచనలు చేశారు.

ఎన్నికల హామీలు అమలు చేయాల్సిందే




మాట్లాడుతున్న అజయ్‌కుమార్

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: ఎన్నికలు సమయంలో జీడి రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆ సంఘ జిల్లా కన్వీనర్ టి.అజయ్‌కుమార్ అన్నారు. కాశీబుగ్గలో శుక్రవారం రైతు ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీడి పిక్కలకు మద్దతు ధర కల్పించి, జీడి బోర్డు, కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారన్నారు. ఇదే విషయంపై పలాస, ఇచ్ఛాపురం ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇచ్చామని పేర్కొన్నారు. మోహనరావు, భాస్కరరావు, దానేష్ తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..అన్నీ

బీమా సంస్థ నిర్ణయాలతో నష్టం



సోంపేట, న్యూస్‌టుడే: జీవిత బీమా సంస్థ తీసుకున్న నిర్ణయాలతో తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, వెంటనే వాటిని ఉపసంహరించాలని కోరుతూ ఏజెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోంపేట ఎల్ఐసీ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన నిరసన కార్యక్రమంలో ప్రతినిధులు వై.వసంతరావు, జి.పద్మలోచన, జి.రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో సాధన చేయండి

ఇచ్ఛాపురం: విద్యార్థులు తమ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రణాళికగా ముందుకు సాగితే ఉన్న స్థాయికి చేరుకుంటారని ఎంఈవో కురమాన అప్పారావు అన్నారు. పురుషోత్తపురం పుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

రైతు సమస్యలపై సదస్సు

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: రైతాంగ సమస్యల పరిష్కార దిశగా, ప్రభుత్వాలను కదిలించేలా ఉద్యమించడం అవసరమని రైతాంగ సమస్యల సాధన కమిటి సభ్యులు దాసరి శ్రీరాములు అన్నారు. పలాస మండలం బొడ్డపాడులో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉద్దాన ప్రాంత ప్రధాన జీవనాధారమైన జీడి, కొబ్బరి, వరి పంటలకు సరైన గిట్టుబాటు ధర రావడం లేదని పలువురు వక్తలు పేర్కొన్నారు. పెట్టుబడులు రాక, వడ్డీల భారం మోయలేక, వసల కార్మికులుగా మారుతున్నారని సభ ఆందోళన వ్యక్తం చేసింది.

అపార్ నమోదులో అప్రమత్తత

కవిటి గ్రామీణం: అపార్ నమోదులో ప్రధానోపాధ్యాయులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంఈవో ధనుంజయ మజ్జి అన్నారు. ఎంఆర్సీ వద్ద ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. అపార్ నమోదులో విద్యార్థుల డేటా, అడ్మిషన్ నంబర్, పుట్టిన తేదీ, తరగతి, ఆధార్ (విద్యార్థితో పాటు తల్లిదండ్రులు)సక్రమంగా నమోదు చేయాలని సూచించారు.

ఉపాధ్యాయులపై యాప్‌ల భారం

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీ రఘువర్మ పేర్కొన్నారు. చిన్నబాడాం, రంగోయి, బ్రాహ్మణతర్లా, బొడ్డపాడు పాఠశాలల్లో ఆయన పర్యటించారు. జీవో నంబర్ 117 రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం లేకుండా చూడాలన్నారు. ఏపీటీఎఫ్ నాయకులు రామన్నాయుడు, టి.వి.ఎస్.నారాయణ, గోపీకృష్ణ, పి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా గజలక్ష్మీదేవి ఉత్సవాలు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: పురపాలకసంఘ పరిధి రత్తకన్న నాయుడువీధిలో గజలక్ష్మీదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం సంధ్యాహారతిని సమర్పించారు.

టెక్కలి

• టెక్కలి • నరసన్నపేట • పాతపట్నం

వసతి గృహం ముందు ఆందోళన


ఆందోళన చేస్తున్న ఎ.బి.వి.పి. సభ్యులు

పాతపట్నం, న్యూస్‌టుడే: విద్యార్థిని మృతిపై విచారణ చేసి న్యాయం చేయాలని ఎ.బి.వి.పి. జిల్లా కన్వీనర్ ఎస్. మదన్‌కుమార్ కోరారు. గురువారం పాతపట్నం ఏకలవ్య పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన నేపథ్యంలో శుక్రవారం స్థానిక పాఠశాల భవనం ముందు ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ మృతి చెందిన విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండు చేశారు. పాతపట్నం కన్వీనరు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

స్థల వివాదంపై ఆర్డీవో విచారణ


పెద్ద పద్మాపురంలో విచారణ చేస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: పెద్ద పద్మాపురంలో మరుగుదొడ్డి నిర్మాణం వివాదాస్పదంపై హైకోర్టు ఆదేశాల మేరకు టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి విచారణ చేపట్టారు. శుక్రవారం గ్రామాన్ని సందర్శించిన ఆయన నిర్మాణాన్ని పరిశీలించారు. ఉర్లాన రుషి తదితరులు కోర్టు ధిక్కారం చేస్తూ నిర్మాణం చేపట్టారని మరో వర్గం ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై ప్రస్తుత పరిస్థితిని పరిశీలించేందుకు టెక్కలి ఆర్డీవో గ్రామాన్ని సందర్శించారు. ఇరువర్గాల నుంచి నివేదికలను, ఆధారాలను సేకరించారు. తహసీల్దార్ బి.పాపారావు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపారు




'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం 'ఇంటర్నెట్ వినియోగంతో లాభ, నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థినులు ఆర్. రష్మిక సంతోషి, జి.శరణ్య, బి.కృతి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రధానోపాధ్యాయిని ఎన్.శోభారాణితో పాటు ఇతర ఉపాధ్యాయినులు విజేతలను అభినందించారు. –న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

నిర్వాసితుల సమస్యలకు మోక్షమెప్పుడో..!


కాలనీలో అంతర్గత రహదారి ఇలా..

–న్యూస్‌టుడే, మెళియాపుట్టి, హిరమండలం

ఆఫ్‌షోర్ జలాశయం నిర్మాణంలో భాగంగా నిర్వాసిత గ్రామమైన దాసుపురం పునరావాస కాలనీలో సమస్యలు తిష్ఠ వేశాయి. 120 కుటుంబాలు ఉన్న కాలనీలో కనీస రహదారులు, కాలువల నిర్మాణానికి నోచుకోలేదు. పాఠశాల, అంగన్‌వాడీ, సామాజిక భవనం, పంచాయతీ కార్యాలయం ఇలా పక్కా భవనాలనీ అసంపూర్తిగానే నిలిచాయి.

కూటమి ప్రభుత్వంపై ఆశలు

ఆర్.అండ్.ఆర్. దాసుపురం కాలనీలో సమస్యలతో సతమతమవుతున్న గిరిజనులు కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. ఆగస్టు 16న పలాసలో ఆఫ్‌షోర్ జలాశయం పనుల ప్రగతి, నిర్వాసితుల సమస్యలపై మంత్రి అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. రెండు నెలలు పూర్తి కావస్తుంది. అధికార యంత్రాంగంలో కదలికలు లేకపోవడంతో నిర్వాసితులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అవస్థలు పడుతున్నాం..

పునరావాస కాలనీలో సమస్యలతో అవస్థలు పడుతున్నాం. అంగన్‌వాడీ, పాఠశాల భవన నిర్మాణాలు పూర్తికాకపోవడంతో కాలనీ నుంచి సుమారు 20 మంది చిన్నారులు నిత్యం కొండ ప్రాంతం దాటుకొంటూ దాసుపురంలో శిథిలావస్థకు చేరిన పాఠశాలకు వెళ్తున్నారు. కాలనీ కొండ సమీప ప్రాంతం కావడంతో నిత్యం విషపూరిత కీటకాల బెడద ఎక్కువగానే ఉంది. ఎండ, వానలకు ఛిద్రమైన రహదారిపై ప్రయాణం ప్రమాదాలకు కారణంగా మారుతోంది. తరచూ ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. –ఎస్.మల్లేష్, ఆర్.అండ్.ఆర్.కాలనీ, దాసుపురం

పరిష్కారమయ్యేలా చూస్తాం

నిర్వాసితుల సమస్యలు, పునరావాస కాలనీలలో మౌలిక వసతులపై గత ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో సమస్య తీవ్రమైంది. ఇటీవల కలెక్టర్, మంత్రి అచ్చెన్నాయుడుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడమైంది. అన్ని శాఖలతో సమన్వయం చేసుకోవడంతో పాటు ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో అంచనా వ్యయంపై స్పష్టత రావాల్సి ఉంది. సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. పరిష్కారమయ్యేలా చూస్తాం.

–రాజశేఖర్, ఈఈ, ఆఫ్‌షోర్ జలాశయం, పలాస

సామాజిక తనిఖీ పక్కాగా చేయాలి


మాట్లాడుతున్న జిల్లా విజిలెన్స్ అధికారిణి స్వరూపారాణి

సారవకోట, న్యూస్‌టుడే: సారవకోట మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి ఈ నెల 19 నుంచి జరగనున్న సామాజిక తనిఖీ పక్కాగా జరగాలని సంబంధితశాఖ జిల్లా విజిలెన్స్ అధికారిణి స్వరూపారాణి సూచించారు. స్థానిక మండల పరిషత్తు సమావేశ భవనంలో శుక్రవారం జరిగిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. జరిగిన పనులకు సంబంధించిన ఎంబుక్ వంటి దస్త్రాలను సామాజిక తనిఖీ బృందానికి అప్పగించాలని సూచించారు. ఎంపీడీవో మోహన్‌కుమార్, ఏపీడీ లోకేష్, మండల స్థాయి అధికారులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

జూద శిబిరంపై దాడి

హిరమండలం, న్యూస్‌టుడే: మండలంలోని చొర్లంగి గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న జూద శిబిరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. రూ. 40,910 నగదు, 8 చరవాణిలు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహమ్మద్ యాసిన్ చెప్పారు.

చెత్త తొలగించరూ..



టెక్కలి-తొలుసూరుపల్లి ప్రధాన మార్గంలో పలుచోట్ల డంపింగ్ యార్డును తలపించేలా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. టెక్కలి పట్టణంలో సేకరిస్తున్న చెత్తను తమ గ్రామానికి వెళ్లే రహదారి పక్కన పారబోస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యపై టెక్కలి పంచాయతీ కార్యదర్శి జగన్నాథరావు స్పందిస్తూ ఆ ప్రాంతం టెక్కలి పంచాయతీ పరిధిలోకి వస్తే తక్షణమే చెత్తకుప్పల్ని తొలగించేలా చర్యలు చేపడతామన్నారు.

–న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

బాబోయ్ కుక్కలు.!

టెక్కలి పట్టణంలో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ స్థానికులకు దడ పుట్టిస్తున్నాయి. కొద్ది రోజులుగా కుక్కకాటు బారిన పడి జిల్లా ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చేవారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. ప్రధాన మార్గాలతో పాటు వీధుల్లో పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తూ దాడిచేస్తున్నాయి. ఈ సమస్యపై పంచాయతీ కార్యదర్శి జగన్నాథరావు స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. నిధులు వెచ్చించేందుకు అనుమతి వచ్చిన వెంటనే కుక్కలను పట్టుకుని దూరప్రాంతానికి తరలించే చర్యలు చేపడతామన్నారు. –న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం



గుంతలమయంగా దారి



నరసన్నపేటలోని పాత జాతీయ రహదారి నుంచి పోలీసు స్టేషన్‌కు వెళ్లే మార్గం గుంతలమయంగా మారింది. చిన్నపాటి వర్షం వస్తే గోతుల్లో నీరు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. పోలీసు స్టేషన్, బాలికల వసతిగృహం, తహసీల్దార్ కార్యాలయం, పోస్టాఫీసుకు వెళ్లాలంటే ఈ మార్గంలో రాకపోకలు సాగించాలి. గతుకులమయంగా మారడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఈవో ద్రాక్షాయినితో ప్రస్తావించగా వెంటనే గోతులు పూడ్చేలా చర్యలు చేపడతామన్నారు. –న్యూస్‌టుడే, నరసన్నపేట

సీసీ రహదారి పనులు

హిరమండలంలోని గులుమూరు గ్రామస్థుల రహదారి సమస్య పరిష్కారమైంది. గులుమూరు నుంచి అలికాం-బత్తిలి రహదారి వరకు కిలోమీటరు పొడవు ఉన్న గ్రావెల్ రహదారి పూర్తిగా ఛిద్రమైంది. పలు పర్యాయాలు రహదారి సమస్యపై 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో స్పందించిన ఎంపీపీ టి.మేనక, సర్పంచి ఎస్.కోటేశ్వరరావులు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఉపాధిహామీ పథకం నిధులు రూ. 26 లక్షలు, మండల పరిషత్తు నిధులు రూ. 12.50 లక్షలతో సీసీ రహదారి నిర్మాణ పనులు చేపట్టారు.



–న్యూస్‌టుడే, హిరమండలం

స్పందనకు వందనం

బిరడాల ఏర్పాటు



కోటబొమ్మాళి బాలికల వసతి గృహంలో నీటిని కుళాయిల ద్వారా వినియోగించుకునేందుకు వీలుగా బిరడాలు(ట్యాపులు)ను శుక్రవారం అమర్చారు. ఇక్కడ నీటి కోసం పాయింట్లు ఉన్నప్పటికీ ట్యాపులు లేకపోవటంతో బాలికలు ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యపై శుక్రవారం 'నీరు రాదు...ఇబ్బంది తీరదు' శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ యంత్రాంగం, స్థానిక సంక్షేమాధికారిణి శ్రీదేవి స్పందించారు. హుటాహుటిన ట్యాపులు అమర్చేందుకు చర్యలు చేపట్టారు. దీంతో బాలికలు నీటిని వినియోగించుకుంటున్నారు. –న్యూస్‌టుడే, కోటబొమ్మాళి



వయోజనులంతా అక్షరాస్యులు కావాలి

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: పదిహేనేళ్ల పైబడిన వయోజనులంతా అక్షరాస్యులు కావాలని ఎంపీడీవో నర్సింహప్రసాద్ పండా, ఏపీఎం త్రినాథమ్మ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయం ఆవరణలో వీవోఏలకు శిక్షణ ఇచ్చారు. ప్రతి పది మంది వయోజనులకు ఒక వాలంటీను నియమిస్తూ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకు సంబంధించి సర్వే సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

కృష్ణమూర్తినాయుడి సేవలు మరువలేనివి

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధికి నిరంతరం పాటుపడిన యెన్ని కృష్ణమూర్తినాయుడి సేవలను మరువలేమని గ్రామస్థులు కొనియాడారు. శుక్రవారం పెద్ద పద్మాపురంలో ఆయన విగ్రహం వద్ద గ్రామస్థులు నివాళులర్పించారు. కృష్ణమూర్తి నాయుడి నాలుగో వర్ధంతి సందర్భంగా గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పెద్దలు ఘనశ్యామ్, వెంకటేశ్వర్లు, శ్రీధర్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ఫలితాలు సాధించాలి

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి వార్షిక ఫలితాల సాధనలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని టెక్కలి ఉప విద్యాశాఖాధికారి విలియం సూచించారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంఈవోలు దేవేంద్రరావు, పద్మానాభరావులతో పాటు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కొత్తూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావు అన్నారు. స్థానిక సామాజిక ఆసుపత్రిలో పారిశుద్ధ్య కార్మికులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సూపరింటెండెంట్ ధర్మాన కిశోర్‌కు వినతి పత్రం సమర్పించారు.

అయ్యప్ప మాలధారణ

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: వాడవాడలా అయ్యప్ప మాలధారణలు వేడుకగా జరుగుతున్నాయి. వేకువ జాము నుంచి కోటబొమ్మాళి అయ్యప్ప ఆలయంలో పురోహితులు సుసరాపు కృష్ణబాబుశర్మ నేతృత్వంలో శుక్రవారం పలు ప్రాంతాలకు చెందిన యువకులు అయ్యప్పమాలలు ధరించారు. అనంతరం అయ్యప్పను దర్శించుకొని విశేష పూజలు చేశారు. కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల గురుస్వాములు పాల్గొన్నారు.

తుపాను షెల్టర్ల పరిశీలన

పోలాకి, న్యూస్‌టుడే: మండలంలోని తీర ప్రాంత గ్రామాల వారు రానున్న రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి పి.మురళీధర్ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం అంపలాం, రేవంపలాం, గుల్లవానిపేట, అక్కువరం కొత్తరేవు గ్రామాల్లో తుపాను షెల్టర్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఎంపీడీవో జి.వి.రవికుమార్ పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే పొలం పిలుస్తోంది

హిరమండలం, న్యూస్‌టుడే: రైతుల సమస్యల పరిష్కారానికే పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని వ్యవసాయాధికారి బి.సంధ్య అన్నారు. శుక్రవారం కిట్టాలపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. లాభసాటి వ్యవసాయ సాగుపై అవగాహన కల్పించారు. ఉద్యాన, వ్యవసాయ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కొత్తూరు, న్యూస్‌టుడే: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కొత్తూరు ఎస్సై అహ్మద్ తెలిపారు. కొత్తూరు నుంచి హడ్డుబంగికి వెళ్లే రహదారిలో శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది సహకరించారు.

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన

నరసన్నపేట, న్యూస్‌టుడే: ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం లియాపి (ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం) ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఈ కార్యక్రమం చేపట్టారు. పాత పద్ధతిలోనే పాలసీలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. లియాపి ప్రతినిధులు ఉప్పాడ పూర్ణారావు, గడ్డేసు, జి. లక్ష్మీనారాయణ, చిన్నవాడు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.





అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

జలుమూరు, న్యూస్‌టుడే: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో కె.అప్పలనాయుడు అన్నారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వెల్ఫేర్ అసిస్టెంట్లు, వెలుగు సీసీలతో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, ఎంఈవోలు మాధవరావు, ప్రసాదరావు, ఏపీఎం హేమసుందరరావు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సౌకర్యాలు మెరుగుపరచాలి


శ్రీముఖలింగం వసతి గృహంలో విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత


టెక్కలి: బీసీ బాలుర వసతిగృహంలో సరకులను పరిశీలిస్తున్న న్యాయమూర్తి జె.శ్రీనివాసరావు

జలుమూరు, టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను మరింత మెరుగుపరచాలని కోటబొమ్మాళి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత పేర్కొన్నారు. మండలంలోని శ్రీముఖలింగం, జలుమూరుల్లో సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహాలను, జలుమూరులో బాలికల సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. శ్రీముఖలింగం వసతి గృహంలో 82 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ మరుగుదొడ్లు, స్నానపు గదులు సరిపడినన్ని లేవని వసతులు కల్పించాలని వసతిగృహం అధికారిని ఆదేశించారు. జలుమూరులో విద్యార్థులకు అందిస్తున్న భోజనం, ఇతర సదుపాయాలపై వారిని అడిగి తెలుసుకున్నారు. వసతిగృహాల అధికారులు బట్న రమణ, లక్ష్మణరావు, మాధవి తదితరులు పాల్గొన్నారు. ★ టెక్కలిలోని బీసీ, ఎస్సీ పోస్టుమెట్రిక్ బాలుర వసతి గృహాలను సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల వసతి, మెనూ అమలు తీరు, నిత్యావసర సరకులను పరిశీలించి వసతిగృహ సంక్షేమాధికారులతో మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని, మెనూలో లోపాలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి పరిస్థితులపై ఆరా తీశారు. ★ డిసెంబరు 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు కోరారు. స్థానిక సబ్ కోర్టు ఆవరణలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. రాజీకి అనుకూలమైన సివిల్, క్రిమినల్, ప్రీలిటిగేషన్ కేసుల్ని ఇరుపార్టీల అంగీకారంతో పరిష్కరించాలని, వీలైనన్ని ఎక్కువ కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా నందెన్న ఉత్సవాలు


ఎల్ఎన్‌పేట: తురకపేటలో నందెన్న

ఎల్ఎన్‌పేట, సారవకోట, న్యూస్‌టుడే: ఎల్ఎన్‌పేట మండలంలో నందెన్న ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పండిన పంటలు క్షేమంగా ఇంటికి చేరుకోవాలని కోరుతూ రైతులు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. తురకపేట, చింతలబడవంజ, బొర్రంపేట తదితర గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ★ సారవకోట మండలంలో నందన్న ఉత్సవాలు సందడిగా జరుగుతున్నాయి. దీంతో గొర్రిబంద, సారవకోట, బురుజువాడ, కోనవానిపేట, వడ్డినవలస, అలుదు తదితర గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి లోకనాథం

సారవకోట, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు మండలంలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని, మండల స్థాయి అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి మంద లోకనాథం సూచించారు. మండల పరిషత్తు కార్యాలయంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఎంపీడీవో మోహన్‌కుమార్, తహసీల్దార్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోషణవాటిక పథకాన్ని విజయవంతం చేయండి

సారవకోట, న్యూస్‌టుడే: పలు అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ వాటిక పథకాన్ని విజయవంతం చేయాలని సంబంధిత శాఖ అధికారులు మోహనరావు, సురేష్‌లు సూచించారు. సారవకోట ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో పథకంపై శుక్రవారం కార్యకర్తలకు అవగాహన కల్పించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో ఘన జీవామృతంతో ఐసీడీఎస్, సారవకోట అక్షరరూప ప్రదర్శన ఆకట్టుకుంది. పీవో కామాక్షి, సెక్టారు పర్యవేక్షకులు పాల్గొన్నారు.

రహదారి పనులకు భూమి పూజ


కోటబొమ్మాళి: లకందిడ్డి పల్లెపండుగ కార్యక్రమంలో తెదేపా నేతలు కింజరాపు ప్రసాదరావు, రమేష్ తదితరులు

టెక్కలి పట్టణం, కోటబొమ్మాళి, హిరమండలం, పాతపట్నం, నందిగాం, కొత్తూరు, న్యూస్‌టుడే: పల్లె పండగ కార్యక్రమం ద్వారా గ్రామీణ రహదారులకు మహర్దశ రానుందని తెదేపా మండల అధ్యక్షుడు బగాది శేషగిరిరావు అన్నారు. తేలినీలాపురం పంచాయతీ వేములవాడ-విశ్వనాథపురం రహదారి పనులకు శుక్రవారం ఆయన భూమిపూజ చేశారు. హనుమంతు రామకృష్ణ, చాపర గణపతిరావు, దల్లి ప్రసాద్‌రెడ్డి, పైల సోమేష్, ఏపీవో ప్రసాద్ పాల్గొన్నారు. ★ కోటబొమ్మాళి మండలం లకందిడ్డిలో పల్లె పండుగ కార్యక్రమంలో తెదేపా నేతలు కింజరాపు ప్రసాదరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు. ★ ఉపాధిహామీ నిధులు రూ.30 లక్షల వ్యయంతో నిమ్మాడలో పంచాయతీరాజ్ పర్యవేక్షణలో సిమెంటు రహదారి నిర్మాణం ప్రారంభమైంది. ★ తెదేపా మండల అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సుభలయ, నౌగుడ, సుభలయ ఆర్ఆర్ కాలనీ గ్రామాల్లో తెదేపా నాయకులు పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. పలు వీధుల్లో సీసీ రహదారులు, కాలువల నిర్మాణ పనుల శంకుస్థాపన చేశారు. ★ తెదేపా మండల అధ్యక్షుడు పైల బాబ్జి ఆధ్వర్యంలో పాతపట్నం మండలంలో సీతారాంపల్లి, బోరుభద్ర, పెద్ద మల్లిపురం, చిన్న మల్లిపురం గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ★ మెళియాపుట్టి మండలంలోని వసుంధర, కొసమాల, గొప్పిలి, సంతలక్ష్మిపురం, తంగిణి, గోకర్ణపురం గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో ఎంపీడీవో నర్సింహప్రసాద్ పండా, తెదేపా కూటమి నేతలు సలాన మోహనరావు, హనుమంతు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు. ★ నందిగాం మండలం ప్రతాపవిశ్వనాథపురంలో గ్రామం నుంచి చెరుకుపల్లి గ్రామానికి వెళ్లే రహదారికి సీసీ రోడ్డు నిర్మించేందుకు భూమిపూజ చేశారు. ★ కొత్తూరు మండలంలోని పొన్నుటూరు, మాకవరం, కుద్దిగాం, నివగాం తదితర గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పలు పనులకు భూమిపూజ చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


టెక్కలి: వేములవాడ-విశ్వనాథపురం రహదారి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న తెదేపా నేతలు, అధికారులు

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల



వ్యాసరచన పోటీలకు హాజరైన విద్యార్థులు

సృజనకు పదును



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

విద్యార్థుల్లో సామాజిక అవగాహన, ఆలోచనా శక్తి పెంపొందించేందుకు 'ఈనాడు' నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో 'అంతర్జాలం వినియోగంతో లాభ నష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై శుక్రవారం పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పదోతరగతి విద్యార్థులు బి.సాయితేజశ్రీ, ఎం.లాలస ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలవగా, తృతీయ బహుమతిని 9వ తరగతి విద్యార్థిని వి.పన్యశ్రీ సొంతం చేసుకుంది. ఉపాధ్యాయులు బి.భార్గవి, ఎన్.రమామణి, టి.జయసుధ, టి.సాయిప్రశాంతి, పి.పార్వతి, కె.రాజ్యలక్ష్మి విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. -న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం),



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ప్రతిభ చూపారు



ప్రశంసాపత్రాలతో విజేతలు

ఆమదాలవలస పట్టణంలోని శ్రీవాణి విద్యానికేతన్ పాఠశాలలో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 'అంతర్జాలం వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీ జరిగింది. ఎన్.సౌజన్య (9వ తరగతి), ఎన్.రోహిణి (8వ తరగతి), పి.సాయిలక్ష్మి (10వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పాఠశాల యాజమాన్యం బలివాడ నారాయణమూర్తి, ఉపాధ్యాయులు కె.వి.రాజారావు, బి.జనార్దనరావు, ఎం.రాజేశ్వరరావు, జి.హరిబాబు, బి.ప్రనవి విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేసి, అభినందించారు.

– న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: శ్రీకాకుళంలో ఈ నెల 20, 21వ తేదీల్లో రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ జూడో పోటీలు జరగనున్నాయి. వీటిలో మప్పంగి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎం.సోనియా, టి.విజయలక్ష్మి, బి.ఆదిత్య, సీహెచ్.జ్ఞానేశ్వరరావు, జి.గుణశేఖర్, టి.మహేశ్ జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు హెచ్‌ఎం ఉమాకుమారి చెప్పారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

అంతరాష్ట్ర రహదారి.. ప్రమాదకరంగా మారి

– న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

వైకాపా ప్రభుత్వం గత ఐదేళ్లు రహదారుల అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దారులను నరకానికి కూపాలుగా మార్చారు. అలికాం - బత్తిలి రహదారి పూర్తిగా ధ్వంసమై.. అధ్వానంగా తయారైంది. ఈ అంతరాష్ట్ర మార్గంలో ప్రయాణించడానికి చోదకులు, ప్రయాణికులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఒడిశా వైపు వెళ్లేందుకు వచ్చే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఏ చోట ఏం జరుగుతోందనని బిక్కుబిక్కు మంటూ వెళ్లాల్సిన దుస్థితి అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరుబుజ్జిలి పోలీసుస్టేషన్ నుంచి ఎల్.ఎన్.పేట మండలం బొర్రంపేట వెళ్లేవరకు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. సుమారు 3కి.మీ దూరం వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఎన్నికల ముందు హడావిడిగా ఈ రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. వారం రోజుల్లో పనులు పూర్తిచేయిస్తామని మాట్లాడారు. నేటికీ పనులు ప్రారంభించలేదు. అర్‌అండ్‌బీ అధికారులు సైతం అప్పుడప్పుడూ ఎర్రబుగ్గి వేస్తూ.. మమ అనిపిస్తున్నారు. దీంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతం. ప్రస్తుత పాలకులైనా పట్టించుకొని ఇక్కట్లు తీర్చాలని కోరుతున్నారు.



సరుబుజ్జిలి పోలీసుస్టేషన్‌కు సమీపంలో పాడైన రహదారి

నిత్యం ప్రమాదాలే..

ఈ రోడ్డులో ప్రయాణించడానికి ప్రయాణికులు హడలెత్తిపోతున్నారు. గతుకుల దాటికి వెన్నుపూసలు కదిలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. [illegible] ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణించక తప్పడంలేదని వాపోతున్నారు.

అధ్వానంగా కల్వర్టులు..

[illegible] అమృతలింగానగరం, బప్పడాం, చిన్నపతంగి, నక్కలపేట, సరుబుజ్జిలి కూడళ్లకు సమీపంలోని కల్వర్టుల రక్షణ గోడలు కూలిపోయి ప్రమాదకరంగా మారాయి. ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదముందని అంటున్నారు.

త్వరలో చేయిస్తాం..

అలికాం - బత్తిలి రహదారిలోని సరుబుజ్జిలి పోలీసుస్టేషన్ నుంచి బొర్రంపేట వరకు దారికి త్వరలో పనులు చేయిస్తాం. దీనికి గుత్తేదారు నుంచి ఒప్పందం కూడా పూర్తయింది.

– ఆంజనేయనాయక్, అర్‌అండ్‌బీ జేఈ



అమృతలింగానగరం వద్ద శిథిలమైన కల్వర్టు రక్షణ గోడ

కూర్మనాథుని సేవలో ఆర్డీవో

గార, న్యూస్‌టుడే: గార మండలం శ్రీకూర్మంలోని కూర్మనాథ క్షేత్రాన్ని [illegible] ఆర్డీవో సుధాసాగర్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం సందర్శించారు. [illegible] స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.



సుధాసాగర్‌కు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఇన్‌ఛార్జి ఈవో గురునాథరావు

బాధ్యతల స్వీకరణ

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణం ఎస్సైగా కనక రాము శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2014 బ్యాచ్‌కు చెందిన ఈయన [illegible] జిల్లాకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ విధులు నిర్వహించిన పి.కిషోర్‌వర్మ బదిలీపై అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ మండలంలోని శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

ఉద్యానం.. అధ్వానం..!

శ్రీకాకుళం నగరంలోని జడ్పీ కార్యాలయం ఎదురుగా హౌసింగ్‌బోర్డు కాలనీలో కార్గిల్ ఉద్యానాన్ని గత ప్రభుత్వ పాలనలో ఎన్నికల ముందు పనులు పూర్తికాకుండా ప్రారంభించారు. నిధులు మంజూరు కాకపోవడంతో గుత్తేదారు ఒప్పందం మేరకు పనులు పూర్తి చేశాడు. దీంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావును వివరణ కోరగా ప్రజలకు సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం



మురుగు కూపం



శ్రీకాకుళం నగరంలోని రామలక్ష్మణ కూడలి సమీపంలో బ్యాంకర్స్ కాలనీలోని ఓ ప్రైవేటు కళాశాల దరి కల్వర్టు వద్ద మిర్తిబట్టిలో వ్యర్థాలు పేరుకుపోవడంతో స్థానికులు దుర్వాసన, దోమలు, ఈగలతో ఇబ్బంది పడుతున్నారు. నీరు ప్రవహించకపోవడంతో వర్షం పడితే అవస్థలు రెట్టింపు అవుతున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావును వివరణ కోరగా సమస్యను పరిష్కరిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

అల్లుకున్న ప్రమాదం

పొందూరు పట్టణంలోని స్టేట్‌బ్యాంకు ఎదురుగా ఉన్న స్తంభంపై పనికిరాని మొక్కలు పెరిగి ప్రమాదకరంగా మారింది. తీగలపైకి మొక్కలు పాకితే విద్యుత్తు ప్రమాదం జరిగే అవకాశముందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నష్టం జరగకముందే విద్యుత్తుశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై ఆ శాఖ ఏఈ రమణమూర్తి వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

– న్యూస్‌టుడే, పొందూరు, గ్రామీణం



వ్యర్థాలు తొలగించారు

స్పందనకు వందనం

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని సీపన్నాయుడుపేట నుంచి జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న సీసీ రహదారిని కొందరు ఆక్రమించి పశువుల వ్యర్థాలు నిల్వ చేయడానికి వినియోగిస్తున్నారు. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఈ నెల 12వ తేదీన ఈనాడులో 'పశువుల వ్యర్థాలతో దుర్వాసన' శీర్షికన ప్రచురితమైన వార్తకు నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు పారిశుద్ధ్య సిబ్బంది పశువుల వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు.

అవస్థలు తీరక.. అభివృద్ధికి నోచుకోక



చింతాడలో ట్రాక్టర్ వద్ద నీరు పడుతున్న మహిళలు

న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

ఆమదాలవలస మున్సిపాలిటీ ఏర్పడి 30 ఏళ్లు దాటుతున్నా.. తాగునీటి కొరత, పారిశుద్ధ్యం లోపం, వీధి దీపాలు వెలగకపోవడం, ట్రాఫిక్ తదితర సమస్యలు నేటికీ పుర వాసులను వేధిస్తూనే ఉన్నాయి. ప్రభుత్వాలు మారినా పరిస్థితి మారటంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైకాపా ప్రభుత్వం పట్టణాభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని అంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వమైనా పట్టించుకొని సమస్యలు తీర్చాలని కోరుతున్నారు.

ఇవీ ప్రధాన సమస్యలు..

పట్టణానికి దూరంగా ఉన్న పలు వార్డులకు నేటికీ తాగునీటికి అవస్థలే. కుళాయిలు లేక నేటికీ చాలా ప్రాంతాలకు ట్రాక్టర్లతో నీరు అందిస్తున్నారు. ★ పట్టణంలోని పలు వార్డుల్లో మూడ్రోజులకు ఒకసారి కాలువల్లో చెత్త తీస్తున్నారని స్థానికులు అంటున్నారు. ★ చాలా ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగటం లేదు. మున్సిపాలిటీ పరిధిలో సుమారు 300 లకు పైగా కొత్త దీపాలు వేయాల్సి ఉంది. ★ వార్డుల్లో నేటికీ చాలా చోట్ల మట్టి రహదారులే ఉన్నాయి. కొన్ని చోట్ల సీసీ రోడ్లు ఉన్నా.. కాలువలు లేకపోవడం తదితర సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడాల్సివస్తోంది.

ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాం..

పట్టణంలోని పారిశుద్ధ్య నిర్వాహణ, కాలువలతో కూడిన రహదారుల నిర్మాణం, తాగునీటి సరఫరా, తదితర పనులకు ప్రణాళికలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాం. నిధులు వచ్చిన వెంటనే అన్ని సమస్యలను పరిష్కరిస్తాం.

– పి.బాలాజీప్రసాద్, మున్సిపల్ కమిషనర్, ఆమదాలవలస



కృష్ణాపురం దారి గట్టుపై చెత్త పోగులు

ర్యాలీ విజయవంతం చేయండి



మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శనివారం ఉదయం 7 గంటలకు శ్రీకాకుళం నగరంలో నిర్వహించనున్న ర్యాలీని విజయవంతం చేయాలని వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ గేదెల ఇందిరాప్రసాద్ కోరారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం సంబంధిత గోడపత్రికను ఆవిష్కరించారు. వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్

సాగునీటి కోసం చేయి చేయి కలిపారు

గార, న్యూస్‌టుడే: భైరిదేశిగెడ్డ ఆయకట్టు పరిధిలో సాగునీటి సమస్యలతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. వంశధార కుడికాలువలో పురుషోత్తపురం రెగ్యులేటరు వద్ద షట్టర్లు ఇరుక్కుపోవడంతో నీరు వృథాగా పోతుండటాన్ని గుర్తించిన కొర్ని, కొర్లాం, తోణంగి, తూలుగు పంచాయతీలకు చెందిన రైతులు వాటిని సరిచేసేందుకు చర్యలు చేపట్టారు. డీఈ క్రాంతికుమార్, ఏఈ పండి శోభన్ నేతృత్వంలో షట్టర్లకు మరమ్మతులు చేశారు.



పురుషోత్తపురం రెగ్యులేటర్ వద్ద మరమ్మతులు చేస్తున్న రైతులు

క్రీడాకారుడికి అభినందన

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన నరసన్నపేట గ్రామానికి చెందిన పెయ్యల సాయిగౌతమ్‌ను జిల్లా ఫుట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి ముని శ్రీనివాసరావు శుక్రవారం అభినందించారు. ఇటీవల ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో భువనేశ్వర్ వేదికగా జాతీయస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ టోర్నీలో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన సాయిగౌతమ్‌ను అభినందిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.కల్యాణ్, ఎం.సత్యనారాయణ ప్రశంసాపత్రాలను కొరియర్ ద్వారా పంపించారు. వీటిని ముని శ్రీనివాసరావు క్రీడాకారుడికి అందజేశారు.

అవీ.. ఇవీ.. అన్నీ

ఉపాధిమేళాలో 21 మంది ఎంపిక

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల డా.బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఏపీఎస్ఎస్‌డీసీ, వర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన జాబ్‌మేళాకు 78 మంది హాజరుకాగా.. 21 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఎంపికలకు మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, టెక్ తమ్మిన సాఫ్ట్‌వేర్, సుమన్ టీవీ హాజరయ్యాయి.

రోడ్డు నిర్మాణంపై విచారణ

పొందూరు: గోకర్ణపల్లిలో సచివాలయానికి వెళ్లడానికి చెరువు గర్భాన్ని పూడ్చి రోడ్డు నిర్మించారని గ్రామానికి చెందిన ఉమామహేశ్వరరావు జిల్లా కేంద్రంలో జరిగిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో తహసీల్దారు వెంకటేష్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. రోడ్డు చెరువునే ఉన్నట్లు గుర్తించారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని తహసీల్దారు తెలిపారు.

ఎస్పీని కలిసిన పోలీసులు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం: ఎస్పీ మహేశ్వరరెడ్డిని పలువురు పోలీసు అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం కలిసి మొక్కలు అందించారు. ఎస్పీను కలిసిన వారిలో జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం సీఐ ఎం.కృష్ణమూర్తి, టాస్క్‌ఫోర్స్ సీఐ కృష్ణారావు, జిల్లా ట్రాఫిక్ రికార్డు బ్యూరో ఎస్ఐ ఎ.కోటేశ్వరరావు ఉన్నారు.

పంట పొలాల పరిశీలన

బూర్జ: సాగునీటి వనరులను నిర్లక్ష్యం చేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారని రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి బి.అప్పలనాయుడు అన్నారు. పణుకుపర్త, ఏటొడ్డుపర్త, కిలంతర తదితర గ్రామాల్లోని పొలాలను పరిశీలించారు.

కార్యదర్శికి సత్కారం

ఎచ్చెర్ల: అరిణాంఅక్కివలస పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి ఇటీవల లావేరు మండలం తాళ్లవలసకు బదిలీపై వెళ్లిన విజయకుమారిని శుక్రవారం గ్రామ సచివాలయంలో సత్కరించారు. నాయకులు గట్టెం శివరామ్, శంకరరావు, సత్యం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రగతి పెంచేలా బోధన



సమావేశంలో డిప్యూటీ డీఈవో, ఉపాధ్యాయులు

జి.సిగడాం, పొందూరు, న్యూస్‌టుడే: విద్యార్థుల ప్రగతి పెంచేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారిణి విజయకుమారి అన్నారు. శుక్రవారం నిద్దాం ప్రాథమిక, జి.సిగడాం కస్తూర్బా పాఠశాలలను సందర్శించారు. ఎంఆర్‌సీ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంఈవోలు అరసాడ రవి, శ్రీనివాసరావు పాల్గొన్నారు. ★ ఉపాధ్యాయులు మార్కుల ఆన్‌లైన్ ప్రక్రియతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన అన్ని పనులను సకాలంలో పూర్తిచేయాలని డిప్యూటీ డీఈవో అన్నారు. పొందూరు మండలం రాపాక, తోలాపి జడ్పీ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

జి.సిగడాం, సరుబుజ్జిలి, ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని తెదేపా మండలాధ్యక్షుడు కె.రవికుమార్ అన్నారు. పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జి.సిగడాం మండలం నడిమివలస, ఎందువ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీపీ ఎం.సత్యవతి, ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ★ నక్కలపేటకాలనీలో సర్పంచి ఎస్.జగదీశ్వరరావు, తెదేపా మండలాధ్యక్షుడు ఎ.రాంబాబు ఆధ్వర్యంలో సీసీ రహదారులకు భూమిపూజ చేశారు. నాయకుడు శివ్వాల సూర్యనారాయణ, ఎంపీడీవో ఎం.పావణి తదితరులు పాల్గొన్నారు. ★ తొగరాం, కలివరంలో సీసీ రహదారులు, కాలువల నిర్మాణానికి నాయకులు టి.చంద్రశేఖర్, టి.శ్రీరామమూర్తి తదితరులు భూమిపూజ చేశారు.

హామీల అమలులో విఫలం

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంపై పోరాటానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని మాజీ సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో మండల, మున్సిపాలిటీ పరిధిలోని వైకాపా నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రతి వైకాపా కార్యకర్త ఒక సైనికుడిలా ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధంగా ఉండాలన్నారు. నాయకులు బి.నారాయణరావు, జి.శ్రీనివాసరావు, బి.రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చదువుపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటరావు

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఉల్లాస్ పథకం ప్రవేశ పెట్టిందని ఎంపీడీవో ఆర్.వెంకటరావు అన్నారు. శుక్రవారం ఆమదాలవలస మండల పరిషత్తు కార్యాలయంలో వెలుగు, సచివాలయ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో వయోజన విద్య అని ఉండేదని, ప్రస్తుతం ఉల్లాస్ అనే పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మొదలుపెట్టిందని తెలిపారు. ప్రతి ఒక్కరికీ చదువుపై అవగాహన ఉండాలని, అధికారులు సిబ్బంది గ్రామాల్లో పర్యటించి అవగాహన కల్పించాలన్నారు. ఈవో పీఆర్డీ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహార ప్రదర్శన తిలకిస్తున్న బాలికలు

జి.సిగడాం, ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సీడీపీవో డి.పాపినాయుడు అన్నారు. శుక్రవారం జి.సిగడాం మండలం మదుపాం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా పంపించి కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచి బి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. ★ ముద్దాడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మునగాకు పొడి తయారీ, దాని ప్రాధాన్యతపై ఐసీడీఎస్ సీడీపీవో డి.పాపినాయుడు అవగాహన కల్పించారు. మునగాకు వ్యాధినిరోధక శక్తి పెంచేందుకు, బీపీ తగ్గించేందుకు తదితర ఆర్యోగ పరమైన లాభాలు కలిగిస్తుందన్నారు.

నిలిచిన రాకపోకలు



నారాయణపురం వద్ద నిలిచిన వాహనాలు

బూర్జ, న్యూస్‌టుడే: బూర్జ మండలం నారాయపురం సమీపంలోని గుత్తావిల్లి రహదారిలో శుక్రవారం ఇసుక లారీ దిగబడి.. సుమారు గంట పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో సంతకవిటి వైపు నదిపై నిర్మించిన వంతెన వద్ద.. ఆమదాలవలస మండలం అక్కులపేట చేరుకునే వైపు.. నారాయణపురం చేరుకునే రహదారిలో వాహనాలు నిలిపోయి ప్రయాణికులు గంట పాటు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చివరకు స్థానికులు యంత్రాలతో లారీను బయటకు లాగడంతో వాహనాలు కదిలాయి. అధిక సంఖ్యలో వస్తున్న ఇసుక లారీల కారణంగా రహదారి గుంతలమయమైందని, దాని వల్ల నిత్యం ఇలాంటి పరిస్థితులు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దారి మారదు.. అవస్థలు తీరవు

గార మండలం గొంటి రహదారిలో మెండపేట గ్రామం వద్ద సీసీ రోడ్డు లోతట్టుగా మారడంతో నీరు నిలిచి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలోని పాఠశాలకు, అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాలన్నా మురుగునీటి నుంచే నడవాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి కె.ఈశ్వరమ్మ మాట్లాడుతూ.. పరిశీలించి చర్యలు చేపడతానన్నారు. – న్యూస్‌టుడే, గార

